




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 25 | సంచిక : 28 | ఆదివారం.26-4-2026 | విజయవాడ | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## లోక్ భవన్ కు వెళ్ళిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**విజయవాడ, ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తో మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు.స్వల్ప అస్వస్థత కారణంగా గవర్నర్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు.గవర్నర్ ఆరోగ్య పరిస్థితి పై యోగక్షేమాలు తెలుసుకున్న సీఎం.గవర్నర్ త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# సీఎం చంద్రబాబు గుండె చప్పుడు బీసీలు

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట ● బీసీలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం ● గత ప్రభుత్వంలో బీసీలపై వేధింపులు ● కూటమి రాకతో బీసీలకు మంచి రోజులు ● బీసీ రక్షణ చట్టానికి తుదిరూపు తీసుకొస్తున్నాం : మంత్రి సవిత ● తాడేపల్లిలో రాష్ట్ర స్థాయి బీసీ సాధికార సమితి కన్వీనర్ల సమావేశం ● సీఎం చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ అవార్డుపై మంత్రి సవిత హర్షం



**తాడేపల్లి/అమరావతి ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** సీఎం చంద్రబాబునాయుడు గుండె చప్పుడు బీసీలేనని, వారి అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ బీసీ సాధికార సమితి కన్వీనర్లు, జోనల్ కో ఆర్డినేటర్లతో మంత్రి సవిత శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీసీ అభ్యున్నతికి కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని ప్రారంభించారన్నారు. రాజ్యాధికారంలో, చట్టాల రూపకల్పనలో బీసీలకు భాగస్వామ్యం కల్పించారన్నారు. ఎందరో బీసీ రాజకీయ ఉద్దండులను టీడీపీ తీర్చిదిద్దిందన్నారు. అన్నగారి స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు బీసీలకు అన్నింటా ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు గుండె చప్పుడు బీసీలన్నారు. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రాధాన్యత కల్పించడానికే బీసీ సాధికార సమితులను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. ఈ సమావేశం ద్వారా ఆదరణ 3.0 పథకం అమలుపై సాధికార సమిత కన్వీనర్ల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలుసుకోనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**గత ప్రభుత్వంలో బీసీలను అణగదొక్కారు** గత రాక్షస ప్రభుత్వంపై బీసీ సాధికార సమితులు అలుపెరగని పోరాటం చేశారని మంత్రి సవిత కొనియాడారు. ప్రాణాలు పోతున్నా భుజాన పెట్టుకున్న పసుపు జెండాను దించలేదన్నారు. బీసీ నేత తోట చంద్రయ్య, కాకినాడ జిల్లాలో లాలం బంగారయ్య తమ ప్రాణాలు పోయినా పసుపు జెండా వదలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా అడ్డుకున్న వైసీపీ రాక్షస మూకలను చూసి తొడగొట్టిన అంజిరెడ్డి తాత తెగువను మరిచిపోలేమన్నారు. గత ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి ప్రశ్నించిన పాపానికి బీసీలపై 26 వేలకు పైగా అక్రమ కేసులు బనాయించారన్నారు. దాడులు, హత్యలు చేశారని, బీసీల జీవనాధారాలను సైతం వదలకుండా ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ. 75,760 కోట్లకు పైగా నిధులను దారి మళ్లించారన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి... బీసీలను 16 వేలకు పైగా పదవులకు దూరం చేశారన్నారు. ఆదరణ పథకాన్ని నిలిపేసి... బీసీ కుల వృత్తులను నిర్వీర్యం చేశారన్నారు.

**త్వరలో బీసీ రక్షణ చట్టానికి తుదిరూపు** సీఎం చంద్రబాబు రాకతోనే బీసీలకు పూర్వవైభవం వచ్చిందని మంత్రి సవిత తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామన్నారు. బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నామన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌లు

● పాలేరులో ఆదర్శంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు ● సమస్య ఎవరు చెప్పినా పరిష్కరించడమే ప్రధానం ● పార్టీలకతీతంగా ప్రజా సేవ.. సమస్యే ప్రధానం ● సమస్య ఏదైనా.. పరిష్కారం ఇక్కడే



**హైదరాబాద్ / నేలకొండపల్లి : ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు నిర్ణయించి ప్రజా దర్బార్‌లను ఏర్పాటు చేస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.అన్నిచోట్ల త్రాగునీరు, విద్యుత్ ,ధరణి వంటి సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు గాను పాలేరు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా ఎంచుకున్నామని తర్వాతికాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని వెల్లడించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు ఇటువంటి దర్బార్‌లను నిర్వహించడానికి ప్రధాన కారణం ప్రజా విశ్వాసాన్ని చూరగొనడమే. వారి సమస్యలను తీర్చడమే. పల్లెలు, తండాలు, గ్రామాలు ఇలా అన్ని స్థాయిల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలను అక్కడికక్కడే తీర్చే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించవచ్చు. మరికొన్నింటికి వారం, నెల, లేదా మూడు నెలలు పట్టవచ్చు. అయితే సమస్యలను కూడా గుర్తించే కార్యక్రమం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. అందుకే ప్రజా ప్రభుత్వం వచ్చిన మూడు నెలలకే అధికారులను ప్రజల వద్దకు పంపించే కార్యక్రమం చేపట్టాం.ప్రజలకు సంబంధించిన సమస్యలపై ఎవరైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చు. ఏ పార్టీకి చెందిన వ్యక్తి అని చూడం .అక్కడ కేవలం సమస్య పరిష్కారమే ప్రధానం. పార్టీలు కేవలం ఎన్నికల వరకే. ఆతర్వాత ప్రజా సేవే ముఖ్యం.గత ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించినా ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వం రోజు రోజుకూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతోంది. అధికారంలో ఎవరున్నా ప్రజా సమస్యలను తీర్చడమే పార్టీల ప్రధాన కర్తవ్యం కావాలి. దీనికోసం ప్రతిచోట సమావేశం జరగాలి. అది ఆ గ్రామానికి, ప్రాంతానికి ఉపయోగపడాలని అన్నారు. గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని, కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని మంత్రి తెలిపారు. "ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియ. మీ కష్టాలను వినే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది కాబట్టే ధైర్యంగా మీ మధ్యకు రాగలుగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌ను కేవలం సభలా కాకుండా, ప్రతి పంచాయతీకి ఒక క్లాస్‌రూమ్ కేటాయించి అధికారులను కూర్చోబెట్టడం ద్వారా సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. స్పాట్‌లోనే పరిష్కరించే వీలున్న సమస్యలను వెంటనే తేల్చేయాలంటూ అధికారులకు సూచించామన్నారు. ఈనెల 27వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

## పులివెందుల పోలీస్ స్టేషన్‌లో సజ్జల భార్గవరెడ్డి విచారణ

**అమరావతి ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** వైసీపీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సజ్జల భార్గవరెడ్డి ఈరోజు పులివెందుల పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. 2024 నవంబర్ 8న నమోదైన కేసులో భాగంగా పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సైబర్ క్రైమ్ అధికారుల బృందం ఆయనను విచారించింది.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులపై అత్యంత అసభ్యకరమైన పోస్టులు పెట్టించారనేది భార్గవరెడ్డిపై ఉన్న ప్రధాన ఆరోపణ.

# జలధార-జలహారతితో జిల్లాలో నీటి భద్రత

- 100 రోజుల కార్యాచరణ పటిష్ట అమలుకు చర్యలు
- విస్తృత ప్రజాభాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతానికి కృషి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో నీటి భద్రత సాధనకు జలధార-జలహారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా గౌరవ సీఎం దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని 100 రోజుల ప్రత్యేక కార్యాచరణగా చేపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం ఆయన తెలిపారు.జిల్లాలో 439 చెరువులున్నాయని.. ఇవన్నీ నిండితే 10 టీఎంసీల నీటిని పట్టి ఉంచవచ్చని.. అయితే ప్రస్తుతం వీటి సామర్థ్యం 6.4 టీఎంసీలుగా ఉందని, ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు జలధార కింద వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఫీడర్ ఛానళ్లు, చెరువుల్లో పూడిక తీతతో పాటు వివిధ పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. స్లూయిస్ మరమ్మతులు, ఫీడర్ ఛానళ్ల అభివృద్ధి వంటివాటిపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా వర్షపు నీటిని సమర్థంగా నిల్వ చేసేందుకు రీచార్జ్ పిట్స్, పర్కొలేషన్ ట్యాంకుల నిర్మాణం, పాత జలవనరుల పునరుద్ధరణపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మున్సిపల్, వ్యవసాయ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఇప్పటికే మార్గదర్శకాలు ఇచ్చినట్లు వివరించారు. నీటి సంరక్షణలో ప్రజల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని వృథా కాకుండా వినూత్న విధానాలను ఆచరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. జలధార కార్యక్రమం ద్వారా జిల్లాలో నీటి భద్రతకు, నీటి సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుందని, భవిష్యత్ తరాలకు స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు: జిల్లాలో వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని, నీటి సమస్యలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే పరిష్కారానికి ప్రత్యేక మొబైల్ బృందాలు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మనుషులు, పశు పక్ష్యాదుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, పీ4 కింద మంచి మనసున్న వారు కూడా చలివేంద్రాల ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలు కూడా వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ**

**శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానము, మోటూరు, గుడివాడ మండలం, కృష్ణాజిల్లా.**

**వ్యవసాయ భూమి సాగు హక్కు లైసెన్సు టెండర్ కమ్ బహిరంగ వేలంపాట ప్రకటన**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రెవెన్యూ ఎండోమెంట్స్, G.O.Ms.No.425 ప్రకారం దేవదాయ శాఖ చట్టం 30/87ను అనుసరించి, కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, మోటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానమునకు సర్వహక్కు భుక్తములో గల గుడ్లవల్లేరు మండలం, పెంజెంద్ర గ్రామంలో గల ఈ క్రింది ఉదహరించిన భూములు, మాగాణి భూమి లైసెన్సు హక్కుకు గాను **ది. 05-05-2026 వ తేది మంగళవారం మధ్యాహ్నం గం॥ 3-00 ల నుండి** శ్రీయుత ఇన్‌స్పెక్టర్ దేవాదాయశాఖ గుడివాడ వారి సమక్షములో టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన నిర్వహించబడును. ఆసక్తి గలవారు ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలెను. ఇతర వివరములకు దేవస్థాన ఆఫీసు పనిచేయు వేళలో సంప్రదించవలెను.

| వ.నెం. | భూములున్న గ్రామము | రీ.సర్వే నెం. | విస్తీర్ణము య. సెం. | ధరావత్తు రూ. | కౌలు కాల పరిమితి | బహిరంగవేలం జరుగు ప్రదేశము, సమయము, తేది |
|---|---|---|---|---|---|---|
| 1 | పెంజెంద్ర గుడివాడ రెవెన్యూ | 251/2 | 0.91 | 1000/- | 2026-27 నుండి 2028-29 3 సం॥ల కాలపరిమితి | ది. 5.05.2026 మంగళవారం మధ్యాహ్నం గం. 3.00 లకు పెంజెంద్ర గ్రామ పంచాయితీ వద్ద |

**కొన్ని ముఖ్యమైన షరతులు**

1. ఈ బహిరంగ వేలం పాట దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి జరుగుచున్నది.
2. ఈ వేలంపాటలో పాల్గొనుటకు దేవస్థానమునకు బకాయిలు ఉన్నవారు గాని లేదా లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు.
3. పాటలో పాల్గొనువారు పాటకు ముందుగా తమ స్థితి గతులను తెలుపుతూ సాల్వెన్స్ సర్టిఫికెట్, దస్తావేజులు లేదా పట్టాదారు పాసుబుక్, టైటిల్‌డీడ్‌తో సహా హామీగా, ఇచ్చి ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొను నిర్ణయం.
4. కాల పరిమితి 2026-27 నుండి 2028-29 వరకు అనగా 3 సంవత్సరములు మాత్రమే.
5. పాట అయిన వెంటనే పాడిన మొత్తం ధరావత్తు కాకుండా పూర్తి సొమ్ము చెల్లించవలెను. ఏకారణం చేతనైన పాడిన మొత్తం పాట సమయమున చెల్లించనిచో ధరావత్తు సొమ్ము అపరాధం క్రింద శ్రీ స్వామి వారి పేరు మీద ఫర్‌ఫిట్ చేయబడును.
6. మిగిలిన పాట షరతులు పాట కాలమందు లేదా దేవస్థానం ఆఫీసు పనిచేయు సమయములో అడిగి తెలుసుకొనవచ్చును మరియు సెల్ నెం. 7337746699 ఫోన్ ద్వారా సంప్రదించవచును.

మోటూరు
ది. 22.04.2026

**గొరిపర్తి నాగమౌనిక**
కార్యనిర్వహణాధికారి
సెల్ : 7337746699



**దేవాదాయ ధర్మాదాయ శాఖ**

కృష్ణా జిల్లా గూడూరు మండలం, గూడూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీమాధవ స్వామి దేవస్థానమునకు చెందిన భూములు ఈ దిగువన ఉదహరించిన విధముగా టెండర్- కం- బహిరంగ కౌలు వేలం పాట నిర్వహించబడును.

| సంఖ్య | గ్రామం | మండలం | ఆర్.ఎస్.నెం: | విస్తీర్ణం | స్థలం |
|---|---|---|---|---|---|
| 1. | నడుపూరు | పెడన మండలం | 90 | 5-65 | గ్రామపంచాయితి ఆఫీసు నడుపూరు ది.2-05-26 ఉదయం 10.00 గం॥లకు |
| 2. | వడ్లమన్నాడు | గుడ్లవల్లేరు మండలం | 448 | 9-14 | గ్రామపంచాయితి ఆఫీసు వడ్లమన్నాడు ది.2-5-26 మద్యాహ్నం - 12.00 గం॥లకు |
| 3. | జక్కంచెర్ల | గూడూరు మండలం | 6 | 5-20 | గ్రామపంచాయితి ఆఫీసు జక్కంచెర్ల ది.2-5-26 మద్యాహ్నం - 3.00 గం॥లకు |

**ఇతర వివరములకు అధికారులను సంప్రదించి తెలుసుకొనవలెను**

గూడూరు.
ది.25-04-26

**కలపటపు నవరంగ్ కిషన్**
**(ఫౌండరు ఫ్యామిలీ మెంబర్)**



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ**

**శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానము, మోటూరు, గుడివాడ మండలం, కృష్ణాజిల్లా.**

**భూములను చేపల చెరువులుగా మార్చుకొనుటకు టెండర్ (కం) బహిరంగ వేలంపాట ప్రకటన**

కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, మోటూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ సీతారామస్వామి దేవస్థానంనకు చెందిన గుడివాడ రెవిన్యూ మోటూరు గ్రామంలో రీ సర్వే నెం. 48/1, 46/1, 36/2 లలో విస్తీర్ణం య. 1.93 సెంట్లు పల్లం భూమిని శ్రీయుత కమీషనర్ దే॥ద॥శాఖ, గొల్లపూడి, ఎన్.టి.ఆర్. జిల్లా వారి అనుమతి ఉత్తర్వులు **RC.No.18026(32)/4/2023** తేది **03-02-2025** ప్రకారం సదరు భూమిని హెచ్చు పాటదారుడే తన స్వంత ఖర్చులతో చేపల చెరువుగా మార్చుకొని చేపలు పెంచి పట్టుకునే హక్కు 5 సం॥ల కాల పరిమితితో నిమిత్తం **ది. 05-05-2026 తేది మంగళవారం ఉదయం 10.00 గంటలకు సదరు దేవస్థానం వద్ద** ఈ క్రింది పేర్కొన్న షెడ్యూలు ప్రకారం, శ్రీయుత ఇన్‌స్పెక్టర్ దేవాదాయశాఖ గుడివాడ వారి సమక్షములో టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తిగలవారు ఈ వేలంపాటలో పాల్గొనవచ్చును.

| వ.నెం. | భూములున్న గ్రామము | రీ.సర్వే నెం. | ఎల్.పి.ఎమ్. నెం. | విస్తీర్ణము య. సెం. | ధరావత్తు రూ. | కౌలు కాల పరిమితి | బహిరంగవేలం జరుగు ప్రదేశము, సమయము, తేది |
|---|---|---|---|---|---|---|---|
| 1 | మోటూరు గుడివాడ రెవెన్యూ | 48/1<br>46/1<br>46/2 | 186<br>182<br>182 | 0.10<br>0.03<br>1.80<br>1.93 | 20,000/- | 5 సం॥లు | ది. 5.05.2026 మంగళవారం ఉదయం గం.10.00 లకు మోటూరు, శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం వద్ద |

**కొన్ని ముఖ్యమైన షరతులు**

1. ఈ వేలం పాట దేవదాయ, ధర్మదాయ చట్టం సెక్షన్ 82 ప్రకారం ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త వారిచే జరుపబడును.
2. దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు ఉన్నవారు గాని, దేవస్థానములో ఇతర ఎట్టి లావాదేవీలు ఉన్నవారు, వారి వారసులు గాని పాటలో పాల్గొనరాదు. పాట పాడుటకు తగిన అర్హత లేని వారిని పాటలో పాల్గొనకుండా చేయుటకు వంశపారంపర్య ధర్మకర్త వారికి పూర్తి అధికారం కలదు.
3. ప్రతి పాటదారుడు పాటకు ముందుగా తమ స్థితి గతులను తెల్పుతూ స్థిరాస్థులకు సంబంధించిన దస్తావేజులు, పట్టాదారు పాసు పుస్తకములు పాటకు ముందు దాఖలు చేసి ధరావత్తు చెల్లించవలెను మరియు ఆధార్ కార్డు లేదా ఏదైనా నివాస ధృవీకరణ పత్రం నకలు దాఖలు చేసి పాటలో పాల్గొనవలెను.
4. పాటలో పాల్గొనదలచిన ప్రతి పాటదారుడు, పాటకు ముందుగా రూ. 20,000/- ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. పాట అయిన వెంటనే హెచ్చు పాటదారు పాడిన మొత్తంలో 1/2 వంతు పాట మొత్తం హామీగా చెల్లించే నిర్ణయం. మిగిలిన 1/2 1/2 సొమ్ము డిపార్టుమెంటు వారి నుండి అమోదపు ఉత్తర్వులు వచ్చిన వెంటనే చెల్లించే నిర్ణయం.
5. హెచ్చు పాటదారు సదరు భూమిని తన స్వంత ఖర్చుతో చెరువులు తవ్వుకునే నిర్ణయం, భూమిలో ఉన్న మట్టిని నాలుగు వైపుల గట్టులకు మాత్రమే ఉపయోగించవలను. బయటకు తోలరాదు.
6. పాటదార్లు సమక్షంలో ముందుగా టెండర్ తెరచి టెండర్ హెచ్చు మొత్తం నుండి పాట ప్రారంభించబడును. టెండర్ దాఖలు చేయుటకు ఆసక్తిగలవారు టెండర్ ఫారంను దేవస్థాన కార్యాలయం నుండి తీసుకుని ది. 05-05-2026వ తేది ఉదయం 10-00 గంటలల లోపు రూ. 20,000/- శ్రీయుత కార్యనిర్వహణాధికారి, శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం, మోటూరు వారి పేరున డి.డి. జతపరిచి సీలు వేసి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అందించవలెను.
7. సదరు భూమిని చేపల చెరువుగా మార్చుకొనుటకు అవసరమైన అనుమతి ఉత్తర్వులను సంబంధిత శాఖల నుండి హెచ్చు పాటదారుడే పొందవలెను.
8. హెచ్చుపాటదారుని పేర పాట కొట్టివేయబడిన వెంటనే ఏ కారణం చేతనైన హెచ్చు పాటదారుడు పాట కాలమందు పాట షరతులకు విరుద్దంగా ప్రవర్తించినను లేక హామీ సొమ్ము చెల్లించక పోయినను తాను చెల్లించిన ధరావత్తు సొమ్మును అపరాధం క్రింద శ్రీ స్వామి పేర జమచేసి సదరు భూమిని వెంటనే వేలంపాట పెట్టబడును.
9. హెచ్చు పాటదారుడు బహిరంగ వేలం ముగిసనసిన నాటి నుండి 120 రోజుల లోపు అన్ని అనుమతులు పొంది, చేపల చెరువులు త్రవ్వుటకు భూమిని స్వాధీనం చేసుకొనవలెను. లేనిచో హెచ్చుపాటదారుడు బహిరంగ వేలం పూర్తి అయిన పిదప చెల్లించిన హెచ్చుపాటలోని 1/2 శాతము, ఆమోదపు ఉత్తర్వులు వచ్చిన తరువాత మొత్తమును దేవస్థానమునకు జమచేసుకుని, అట్టి భూమిని తిరిగి బహిరంగవేలం నిర్వహించబడును.
10. ఈ వేలం పాటను ఏ కారణం చెప్పకుండ వాయిదా వేయుటకు, పాట షరతుల యందు మార్పులు చేయుటకు సంస్థ వంశపారంపర్య ధర్మకర్త వారికి అధికారం కలదు.
11. మిగతా పాట షరతులు పాటకాలమందు తెలియజేయబడును. మరియు మిగిలిన వివరములకు దేవాలయ కార్యాలయం నందు మరియు సెల్ నెం. 7337746699 ఫోన్ ద్వారా సంప్రదించవచును.

మోటూరు
ది. 22.04.2026

**గొరిపర్తి నాగమౌనిక**
కార్యనిర్వహణాధికారి
సెల్ : 7337746699



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ**

**శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానము, మోటూరు, గుడివాడ మండలం, కృష్ణాజిల్లా.**

**చేపల చెరువు చేపల పెంపకం లైసెన్స్ నిమిత్తం టెండర్ (కం) బహిరంగ వేలంపాట ప్రకటన**

కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, మోటూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ సీతారామస్వామి దేవస్థానంనకు చెందిన గుడివాడ రెవిన్యూ దొండపాడు గ్రామంలో రీ సర్వే నెం. 27లో య.4.16 సెంట్లు చెరువునకు ఈ క్రింది పేర్నొన్న ప్రకారం చేపల చెరువు & చేపలు పెంపకం లైసెన్స్‌నకు 3 సంవత్సరముల కాలపరిమితికి ప్రభుత్వ జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 426 రెవెన్యూ (దేవదాయ - ధర్మదాయ శాఖ-1) డిపార్ట్‌మెంట్ తేది : 9-11-2015 ప్రకారం 3 సం॥ల కాల పరిమితితో **ది. 05-05-2026 తేది మంగళవారం ఉదయం 11.00 గంటలకు దొండపాడు సచివాలయం వద్ద** ఈ క్రింది పేర్కొన్న షెడ్యూలు ప్రకారం, శ్రీయుత ఇన్‌స్పెక్టర్ దేవాదాయశాఖ గుడివాడ వారి సమక్షములో లైసెన్స్ టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తిగలవారు ఈ వేలంపాటలో పాల్గొనవచ్చును.

**షెడ్యూల్ వివరములు**

| వ.నెం. | భూములున్న గ్రామము | భూ స్థితి | రీ.సర్వే నెం. | విస్తీర్ణము య. సెం. | ధరావత్తు రూ. | కౌలు కాల పరిమితి | బహిరంగవేలం జరుగు ప్రదేశము, సమయము, తేది |
|---|---|---|---|---|---|---|---|
| 1 | దొండపాడు, గుడివాడ రెవెన్యూ | చెరువు | 27 | 4.16 | 45,000/- | 2026-27 నుండి 2028-29 3 సం॥ల కాలపరిమితి | ది. 5.05.2026 మంగళవారం ఉదయం గం.11.00 లకు దొండపాడు సచివాలయం వద్ద |

**షరతులు**

1. టెండర్ (కం) బహిరంగవేలం పాట హిందూ దేవదాయ ధర్మదాయ 30/87 సెక్షన్ 87 ప్రకారం ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడుచున్నది.
2. దేవస్థానమునకు ఏ విధమైన బకాయిలు ఉన్నవారు కాని, వారి వారసులు కానీ, దేవస్థానంతో ఇతర ఎట్టి లావాదేవీలు ఉన్నవారు కానీ, టెండర్ (కం) బహిరంగ వేలంలో పాల్గొనరాదు. హిందువులు మాత్రమే పాటలో పాల్గొనవలెను. పాట పాడుటకు టెండర్ (కం) బహిరంగ వేలంపాటలో తగిన అర్హత లేనివారిని పాటలో పాల్గొనకుండా చేయుటకు కార్యనిర్వహణాధికారి వారికి పూర్తీ అధికారం కలదు.
3. ప్రతీ పాటదారుడు పాటకు ముందుగా తమ స్థితి గతులను తెలుపుతూ తమ స్థిరాస్తులకు సంబంధించి దస్తావేజులకానీ, పట్టాదారు పాస్‌పుస్తకములుకాని, ఆధార్ నఖలు దాఖలు చేసి పైన పెడ్యుల్ నందు పేర్కొన్న ప్రకారం ప్రతీ ప్లాటుకు ధరావత్తు చెల్లించవలెను. బహిరంగవేలం పాటలో పాల్గొనదలిచిన ప్రతీ పాటదారుడు పాట అయిన వెంటనే హెచ్చుపాటదారుడు పాడిన మొత్తం సంవత్సరం లైసెన్స్ రుసుము ముందుగా చెల్లించు నిర్ణయం.
4. టెండర్ దాఖలు చేయువారు టెండర్ ఫారం కొరకు ది.03-05-2026 శనివారం సాయంత్రం గం. 5-00 లోపు రూ.100/- లు చెల్లించి దేవస్థానం కార్యాలయం వద్ద టెండర్ ఫారం పొంది టెండర్‌తో పాటు పై ప్రథమ ధరావత్తు డిమాండ్ క్రాఫ్ట్ రూపంలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, మోటూరు చెల్లుబాటు అగున్నట్లుగా కార్యనిర్వహణాధికారి శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానము, మోటూరు వారి పేరున తీసి టెండర్‌తో పాటు జతపరచవలెను.
5. టెండర్ దాఖలు చేయువారు టెండర్ ఫారం మరియు ధరావత్తుతో ది.05-05-2026వ తేది మంగళవారం ఉదయం గం. 11-00 లకు శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానము, మోటూరు వద్ద ఏర్పాటు చేయయబడిన టెండర్ బాక్స్ నందు టెండర్ దాఖలు చేయవలెను.
6. టెండర్ బాక్సు పాట అయిన తదుపరి పాటదారుల సమక్షంలో తెరచి ఫీల్డ్ టెండర్ లో నమోదు చేసిన పాట మరియు బహిరంగ వేలంలో పాడిన పాటలో ఏది హెచ్చుపాట అగునే వారిని హెచ్చుపాటదారునిగా సదరు పాట సమయంలో ప్రకటించి ధృవీకరించబడును.
7. హెచ్చుపాటదారుని పేరుని పాట కొట్టివేయబడిన వెంటనే ఏకారణం చేతనైన హెచ్చుపాటదారుడు పాట షరతులకు విరుద్ధంగా ప్రవర్తించుననూ లేక హామీ సొమ్ము చెల్లిందలేక పోయిననూ, తరావత్తు సొమ్ము స్వామివారి పేర అపరాధం క్రింద జమ చేసి పాటదారులలో రెండవ హెచ్చుపాటదారుని ఎన్నుకునే అధికారం సంస్థ కార్యనిర్వహణాధికారికి కలదు. రెండవ హెచ్చుపాటదారుడు సదరు లైసెన్స్ పొందుటకు అంగీకరించనిచో మరల వెంటనే పాట పెట్టబడును. అందుపై వచ్చు నష్టమును మొదట హెచ్చుపాటదారుడు వద్ద నుండి వసూలు చేయబడును.
8. జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 426 రెవెన్యూ (దేవదాయ - ధర్మదాయ శాఖ-1) డిపార్ట్‌మెంట్ తేది : 9-11-2015 9-11-2015 ప్రకారం హెచ్చు పాట మొత్తమునకు మొదట సంవత్సరం లైసెన్స్ రుసుముపై రెండవ సంవత్సరమునకు 10% పెంపుదల మూడవ సంవత్సరమునకు రెండవ సంవత్సరం లైసెన్స్ రుసుముపై 10% పెంపుదల చేయు నిర్ణయం.
9. సదరు షెడ్యుల్ దాఖలా భూములు పరిమాణం నందు హెచ్చు తగ్గులు వున్నా హెచ్చుపాటదారుడు భరించి లైసెన్స్ రుసుం యావత్తు చెల్లించు నిర్ణయం హెచ ప్రభుత్వం వారికి చెల్లించవలసిన అన్నిరకముల పన్నులు, నీటి పన్నులు, డ్రైనేజి పన్నులు వగైరాలు సంస్థ పేరనే తామే చెల్లించవలెను.
10. ఈ టెండర్ (కం) బహిరంగ వేలంపాట ఏ కారణం చెప్పకుండా వాయిదా వేయుటకు పాట షరతులు నందు మార్పులు చేర్పులు చేయుటకు కార్యనిర్వహణాధికారి వారికి అధికారం కలదు. మిగిలిన పాట షరతులు పాట కాలంనందు తెలియజేయబడును. మరియు మిగిలిన వివరములు కొరకు దేవస్థానం కార్యాలయం పనివేళలలో లేక కార్యనిర్వహణాధికారి సెల్ నెం. 7337746699 ద్వారా గానీ, సంప్రదించగలరు.

మోటూరు
ది. 22.04.2026

సం॥ **గొరిపర్తి నాగమౌనిక**
కార్యనిర్వహణాధికారి
సెల్ : 7337746699

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన సర్పంచ్ గరిక ఉపేంద్ర



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, మండలం సీతంపేట గ్రామంలో రెడ్డిపాలెం గ్రామం నందు ఉమ్మడి గ్రామపంచాయతీ రైతుల కోరిక మేరకు 20 లక్షల రూపాయల వ్యాయంతో సిసి రోడ్డు కు శనివారం శంకుస్థాపన చేసిన సీతంపేట సర్పంచ్ గరిక ఉపేందర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని, ప్రతి వీధిని అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మా గ్రామ పంచాయతీలోని రైతుల కోరిక మేరకు స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చొరవతో 20 లక్షల రూపాయలు వ్యాయామంతో సీసీ రోడ్డు వేయడం జరుగుతుందని అన్నారు . మా గ్రామ పంచాయతీపై ప్రత్యేక చొరవ చూపించి అడిగిన వెంటనే మాకు నిధులు ఎమ్మెల్యే కేటాయించడం పట్ల మా గ్రామంలోని దాదాపుగా 40 లక్షల రూపాయల సిసి రోడ్లు వేపించటం జరిగిందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి వసంత గ్రామ పెద్దలు ఏడాకుల శ్రీనివాస్ రెడ్డి ముసుగు గోపాల్ రెడ్డి దేవులపల్లి శ్రీనివాస్ పంచాయతి మల్టీ పర్పస్ వర్కర్స్ లావుడియా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలి

**శ్రీ నాభి శిల (బొడ్రాయి) ప్రతిష్టాపన మహోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజలు**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 25 (వార్తాప్రభ):**లింగంపల్లి గ్రామంలో శ్రీ నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్టాపన మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై,సీనియర్ నాయకుడు మారబోయిన రాజు యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణలో ప్రతి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపనకు విశిష్టమైన సంప్రదాయం ఉందన్నారు. గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని,అపశకునాలు దరిచేరకుండా ఉండాలని పూర్వీకులు బొడ్రాయిని ప్రతిష్టించేవారని తెలిపారు.అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు.గ్రామ దేవతలపై విశ్వాసంతో ఊరి మధ్యలో బొడ్రాయిని ప్రతిష్టించి ప్రతి ఏడాది పూజలు, జాతరలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు కులమతాలకు అతీతంగా ఏకమై పాల్గొంటారని పేర్కొన్నారు.బొడ్రాయి నిర్మాణం మూడు భాగాలుగా ఉంటుందని, కింది భాగాన్ని బ్రహ్మ స్వరూపంగా, మధ్య భాగాన్ని విష్ణు స్వరూపంగా,పై భాగాన్ని శివలింగాకారంగా చెక్కుతారని వివరించారు.ప్రతిష్టకు ముందు శీతలాదేవి యంత్రాన్ని స్థాపించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మారబోయిన రాజు యాదవ్,అక్తర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చింతకింది రవీందర్ గౌడ్,రవి యాదవ్, మల్లేష్ యాదవ్,మల్లేష్ గౌడ్, పవన్ తదితరులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాలనలో కొత్త అధ్యాయం - 99 రోజులు!!




99 రోజుల ప్రయాణం ప్రజల కోసం మొదలైంది,
ప్రజా పాలనలో కొత్త వెలుగు వెలిగింది.
ప్రతీ ఉదయం సమస్యలపై చర్చ మొదలై,
ప్రతీ సాయంత్రం పరిష్కారాలు చేరువయ్యాయి!!
గ్రామాల్లో గళం వినిపించగా నాయకులు విన్నారు,
పట్టణాల్లో అభివృద్ధి అడుగులు ముందుకు పడ్డాయి.
పాఠశాలల్లో విద్యా వెలుగు నిండింది,
ఆసుపత్రుల్లో సేవల సౌరభం విరజిమ్మింది!!
రైతు చెమటకు విలువ ఇచ్చిన రోజులివి,
పంట పొలాల్లో ఆశల మొగ్గలు పూసిన క్షణాలు.
ఉద్యోగావకాశాల దారి తెరచి,
యువతకు కొత్త కలలు చూపిన వేళ!!
ప్రతీ రోజు పథకాలు ప్రజల్లోకి చేరగా,
ప్రతీ నిర్ణయం ప్రజల మేలు దిశగా సాగింది.
సంక్షేమం సిరులుగా విరబూసి,
సమానత్వం పునాది బలపడింది!!
99 రోజులు కేవలం సంఖ్య కాదు,
ప్రజల నమ్మకానికి ప్రతిబింబం.
కాంగ్రెస్ పాలనలో ప్రజా స్వరం వినిపించి,
భవిష్యత్తుకు బాటలు వేసిన యాత్ర ఇది!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని, 9849555485

# గోదావరిఖనిలో నిక్షయ్ శివిర్ 2.0!!

- 150 మందికి ఉచిత ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు
- క్షయ రహిత సమాజమే లక్ష్యం
- ప్రజా పాలనలో ఆరోగ్యానికి పెద్దపీట
- రామగుండం పి.హెచ్.సి. డాక్టర్ నర్మద





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 24 (వార్తాప్రభ ప్రతినిధి)** 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహిస్తున్న నిక్షయ్ శివిర్ 2.0 కార్యక్రమంలో శనివారం గోదావరిఖని ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ స్కూల్ వేదికగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. రామగుండం ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ నర్మద పర్యవేక్షణలో ఈ శిబిరం కొనసాగగా, క్షయవ్యాధి నివారణే లక్ష్యంగా ప్రజలకు ఛాతీ పరీక్షలు, ఎక్స్‌రే సేవలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్మద మాట్లాడుతూ, పరీక్షలు చేయించుకున్న ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేసుకున్నామని, రిపోర్టుల్లో ఏవైనా ఇబ్బందికర లక్షణాలు కనిపిస్తే సంబంధిత వ్యక్తులకు మొబైల్ ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. ప్రజల్లో క్షయపై అవగాహన పెంచడం, ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుని వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ నర్మద పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏఎన్ఎంలు శంకరమ్మ, భాగ్య, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్‌తో పాటు పలువురు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని సేవలందించారు.

# 2వ డివిజన్లో క్షేత్రస్థాయి పర్యటన!!

- ఎన్టీపీసీ నాలా పూడిక తీతకు అంగీకారం
- ఎస్టీ కాలనీ వంతెన, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి హామీ
- ప్రమాదకర తీగలు, శిథిల స్తంభాల తొలగింపునకు చర్యలు
- నల్లా కనెక్షన్లు, పారిశుద్ధ్యంపై ఇంటింటా అవగాహన
- రామగుండం మేయర్ మహంకాళి స్వామి





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 25 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం మేయర్ మహంకాళి స్వామి శనివారం 2వ డివిజన్, జంఘూలపల్లి, న్యూ పోరట్ పల్లిలో వార్డు బాట చేపట్టారు. కార్పొరేటర్ తో కలిసి పర్యటించి ఎన్టీపీసీ నాలా పూడిక వల్ల ఏటా ముంపు సమస్య వస్తుందని గుర్తించారు. నాలాలో పూడిక తీతకు ఎన్టీపీసీ అంగీకరించిందని, త్వరలో పనులు మొదలుపెడతారని తెలిపారు. ఎస్టీ కాలనీలో వంతెన నిర్మాణం, అవసరమైన చోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ కష్టాలపై స్పందించి త్రీ ఫేజ్ సరఫరాకు ఎన్పీడీసీఎల్‌కు ఆదేశాలు ఇచ్చారు. ప్రమాదకర విద్యుత్ తీగలకు మిడిల్ పోల్స్ వేసి, శిథిల స్తంభాలను తొలగించాలని సూచించారు. నల్లా కనెక్షన్ లేని ఇళ్లకు మున్సిపల్ సిబ్బందితో అవగాహన కల్పించి కనెక్షన్లు ఇప్పిస్తామన్నారు. రోడ్లు, కాలువలపై చెత్త వేయవద్దని, ఆక్రమణలు చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మెప్మా, అంగన్ వాడీ సిబ్బందితో ఇంటింటా అవగాహన కల్పిస్తూ అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొనగా లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం అల్పాహారం అందించింది.

## ముప్పవరపు లీలా రామకృష్ణ ప్రసాద్ ట్రస్ట్ భూములపై హైకోర్టు స్పష్టమైన తీర్పు



**విజయవాడ : ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కానూరు ప్రాంతంలోని ముప్పవరపు లీలా రామకృష్ణ ప్రసాద్ ట్రస్ట్‌కు చెందిన భూములపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించిందని హై కోర్టు ప్రముఖ న్యాయవాది పాలేటి ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం కేదారాజేశ్వర పేట ప్రభాస్ కాలేజి పక్కన ఉన్న పాలేటి లా అసోసియేట్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనములూరు మండలం కానూరు నాగార్జున హాస్పిటల్ వెనక ఉన్న ఆర్ఎస్ నెంబర్ 256/4 లోని ఎకరం 32 సెంట్లు,తాడిగడపలోని ఆర్ఎస్ నెంబర్ 45/1 లోని ఎకరం 50 సెంట్లు,యనమలకుదురులోని ఆర్ఎస్ నెంబర్ 45/1 సి లోని ఎకరం 93 సెంట్లుభూములు,యనమల కుదురు ఆర్ ఎస్ 80/5 లోని ఎకరం 5 సెంట్లకి చెందిన భూములు ట్రస్ట్ కు సంబంధించినవని హైకోర్టు స్పష్టమైన తీర్పుని వెలువరించిందన్నారు.గతంలో కొందరు కబ్జాకోరులు ట్రస్ట్ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొని చివరకు విజయం సాధించామని తెలిపారు.సుమారు 24 ఏళ్ల పాటు సాగిన ఈన్యాయపోరాటంలో ట్రస్ట్‌కు అనుకూలంగా తీర్పు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ట్రస్ట్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు విద్య, వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ట్రస్ట్ ఆస్తులు ఇప్పటికీ ట్రస్ట్ ఆధీనంలోనే ఉన్నాయని వెల్లడించారు. అనంతరం ముప్పవరపు లీలావతి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పేదల విద్యా వైద్యం కోసం ఫస్ట్ కృషి చేస్తుందని తెలిపారు అలాంటి ట్రస్టు భూములను కబ్జా చేసేందుకు కొంతమంది కబ్జాకోరులు తీవ్ర ప్రయత్నాలు చేశారని తెలిపారు ఒకానొక దశలో అమెరికా నుంచి ట్రస్టు భూములు కాపాడేందుకు వచ్చిన తనపై తన కుటుంబ సభ్యులపై బెదిరింపులకు దాడులకు దౌర్జన్యాలకు కబ్జాకోర్లు తెగబడ్డారని గత వైసిపి ప్రభుత్వం హయాంలో కొంతమంది ఉన్నతాధికారుల ప్రోత్భలంతో కబ్జా కోరులు తమపై దాష్టికానికి తెగబడ్డారని ఆరోపించారు.. పలు తప్పుడు కేసులు సైతం నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు...ట్రస్ట్ ఆశయాల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా న్యాయపోరాటం చేశామని తమ పోరాటానికి దేవుడు ఆశీస్సులతో పాటు పలు సామాజిక సంఘాలు, మీడియా మిత్రులు ఎంతో కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక సమస్యల పరిష్కారంలో స్థానిక కాలనీల అసోసియేషన్లు క్రియాశీలకంగా ఉండాలి

**-మున్సిపల్ కమిషనర్**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 25 (వార్తాప్రభ):**సైబరాబాద్ పరిధిలోని కాలనీల అభివృద్ధి,మౌలిక సదుపాయాల మెరుగుదల,పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారిస్తూ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే ఆధ్వర్యంలో శనివారం కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.వేసవి నేపథ్యంలో నీటి వృథాను అరికట్టాలని అధికారులు సూచించారు.ప్రతి ఇంటి వద్ద, ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో నీటి కొరత తగ్గుతుందని వివరించారు.కాలనీలలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల ఆట స్థలాలు,సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. కాలనీలను 'జీరో వేస్ట్' జోన్లుగా మార్చేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.స్థానిక సమస్యల పరిష్కారంలో కాలనీ అసోసియేషన్లు క్రియాశీలంగా ఉండాలని, అధికారులతో సమన్వయం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో జోనల్, సర్కిల్ స్థాయి అధికారులు,వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నృత్య సమ్మేళనం యువ కళాకారులకు వేదికగా నిలుస్తుంది



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 25 (వార్తాప్రభ):**మాధాపూర్ లోని శిల్పారామంలో నిర్వహించిన "నృత్య సమ్మేళనం--2026" రెండు రోజుల సాంస్కృతిక ఉత్సవం శనివారం అంఫి థియేటర్‌లో ఘనంగా ముగిసింది. కందుల కూచిపూడి నాట్యాలయం,శిల్పారామం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.రెండో రోజు కుమారి దివిజ, కుమారి వైష్ణవి కూచిపూడి నృత్యాలతో అలరించగా,బెంగళూరుకు చెందిన డా.హనీ ఉన్నికృష్ణన్ మోహినియాట్టం ప్రదర్శించారు.ఇంఫాల్‌కు చెందిన గోపాల్ సింగ్ మణిపురి నృత్యం, ఝార్ఖండ్‌కు చెందిన త్వరిత్ సర్కార్,రవి కథక్ నృత్యాలతో ఆకట్టుకున్నారు.ఇందిరా పరాశరం శిష్య బృందం కూచిపూడి నృత్యంతో ప్రేక్షకులను రంజింపజేసింది.దేశం నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు రెండు రోజుల పాటు తమ ప్రతిభను ప్రదర్శించారు.భారతీయ శాస్త్రీయ నృత్యరూపాలు వేదికపై ఆవిష్కృతమయ్యాయి.కార్యక్రమానికి పసుమర్తి శేషు బాబు, వేదాంతం విదుమౌళి, కొక విజయలక్ష్మి,మధుసూదన్, ఇందిరా పరాశరం ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు నృత్య సమ్మేళనం యువ కళాకారులకు వేదికగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ఆలయ ఫౌండేషన్ అండ!!

**నరహరి కృషితో నిలబడ్డ ముజీబ్**
**ప్రమాద బాధితుడికి ఉచితంగా కృత్రిమ కాలు**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 24 (వార్తాప్రభ ప్రతినిధి)**ఆలయ ఫౌండేషన్ ఫౌండర్ పరికిపండ్ల నరహరి చొరవతో గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్‌కు చెందిన షేక్ ముజీబ్‌కు ఉచితంగా కృత్రిమ కాలు అమర్చారు. మీ సేవ కేంద్రంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ముజీబ్ ప్రమాదవశాత్తు ఎడమ కాలు కోల్పోయి ఇబ్బంది పడుతుండగా, సహాయం కోసం ఆలయ ఫౌండేషన్ సభ్యులు కీర్తి నాగార్జున, అక్రంను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఫౌండేషన్ హైదరాబాద్‌లోని భగవాన్ మహావీర్ ట్రస్ట్ సహకారంతో బాధితుడికి ఉచితంగా కృత్రిమ కాలు అందించే ఏర్పాట్లు చేశారు. ట్రస్ట్ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ముజీబ్‌కు కృత్రిమ కాలు అమర్చి, నడక శిక్షణ కూడా ఇప్పించారు. దీంతో మళ్లీ తన కాళ్లపై నిలబడి సాధారణ జీవితం గడిపే అవకాశం లభించిందని బాధితుడు కన్నీటి పర్యంతం అయ్యాడు. తనకు పునర్జన్మ ప్రసాదించిన నరహరి, ఆలయ ఫౌండేషన్ బృందానికి, భగవాన్ మహావీర్ ట్రస్ట్‌కు ముజీబ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద, మధ్యతరగతి వారికి అండగా నిలుస్తూ ఆలయ ఫౌండేషన్ చేస్తున్న సేవలను స్థానికులు కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

## ట్రాఫిక్ నియమాలపై కఠిన హెచ్చరిక!!

**షాపు యజమానులు, వాహనదారులు నిబంధనలు పాటించాలి**
**ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు సూచనలు**





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 25 (వార్తాప్రభ ప్రతినిధి)**స్థానిక లక్ష్మీ నగర్ ప్రాంతంలో శనివారం ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు షాపు యజమానులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. షాపుల వద్దకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను నియమ నిబంధనలకు అనుగుణంగా పార్క్ చేయించాల్సిన బాధ్యత యజమానులదేనని స్పష్టం చేశారు. షాపుల ముందు రహదారిపై ఎలాంటి వస్తువులు ఉంచరాదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే చర్యలు చేపట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలనీ సూచించారు. టూవీలర్ నడిపేవారు హెల్మెట్ ధరించకపోతే జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఫోర్వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలనీ, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఎప్పటికప్పుడు వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రత కోసం ఈ నియమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. షాపు యజమానులు, ప్రజలు సహకరించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి హరి శేఖర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సరీని పరిశీలించిన మండల ఎంపీడీవో భారతి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, మండలంలోని సీతంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నర్సరీని మండల ఎంపీడీవో బి, భారతి శనివారం పరిశీలించారు అనంతరం ఆమె మాట్లాడుతూ ఆక్సిజన్ పెంపు: చెట్లు కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని, మనకు అవసరమైన ప్రాణవాయువును (ఆక్సిజన్) విడుదల చేస్తాయి అని పర్యావరణ సమతుల్యత: మొక్కలు గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో సహాయపడతాయి అని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలు మంచిగా పెంచి గ్రామంలోని ఖాళీ ప్రదేశాలలో మొక్కలను పెంచడం వల్ల గ్రామంలోని ఆక్సిజన్ శాతం పెరిగి ప్రజలకు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరిక ఉపేందర్ ఎంపీఓ శ్రీనివాస్ సీతంపేట కార్యదర్శి బి వసంత ఉపాధి హామీ ఈసీ నాగరాజు ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పలత పాల్గొన్నారు



# వ్యాపార విజయానికి ఐపిఆర్ కీలకం



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 25:(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతి వ్యాపారీ వ్యాపారంలో మెలకువలతో పాటు ఐపిఆర్ గురించిన సమగ్రమైన అవగాహన తప్పసరిగా పొందాలని, వ్యాపార విజయంలో ఐపిఆర్ కీలకమైన పాత్ర పోషిస్తుందని వెల్లూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తి జైన్ అన్నారు. వరల్డ్ ఐపిఆర్ డే సందర్భంగా కె.బి.ఎన్ కళాశాల మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఐపిఆర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కీర్తి జైన్ మాట్లాడుతూ వ్యాపార నిర్వహణతో ఐపిఆర్ గురించిన అవగాహన పెంచుకోవటం వల్ల అనేక సమస్యలను తేలికగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఐపిఆర్ అనుసంధానం ద్వారా వ్యాపారంలో అవలంబించే కొత్త పోకడలకు రక్షణ కలుగుతుందన్నారు. ప్రభుత్వం కూడా ఐపిఆర్ కి అత్యంత ప్రాముఖ్యత ఇస్తోందన్నారు. కాపీరైట్స్, ట్రేడ్ మార్క్స్, పేటెంట్స్, ట్రేడ్ సీక్రెట్స్ తదితర అంశాల గురించి ఉదాహరణ పూర్వకంగా సమగ్రమైన విశ్లేషణ చేస్తూ వివరించారు. వ్యాపారం ప్రారంభించిన తర్వాత ఐపిఆర్ లో రిజిస్టర్ అయ్యేవిధానం, రిజిస్ట్రేషన్ ద్వారా పొందే ప్రయోజనాలు తదితర అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలు సృష్టించే వ్యక్తులుగా మారాలన్నారు. ఇతరుల ఆలోచనలను కాపీ చేయడం కంటే, స్వంత సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవడం భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందన్నారు. పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేష్, మేనేజ్ మెంట్ విభాగాధిపతి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల సోమన్న "స్నేహబంధం " పుస్తకావిష్కరణ




**పలమనేరు, ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న 96వ "స్నేహబంధం "పుస్తకావిష్కరణ సాయి గార్డెన్ సిటీ, గంగవరం,పలమనేరు చిత్తూరు జిల్లాలో ఘనంగా జరిగింది. అవనిగడ్డ శాసనసభ్యులు డా.మండలి బుద్ధ ప్రసాద్,పలమనేరు శాసనసభ్యులు యన్. అమరనాథరెడ్డి, ప్రపంచ తెలుగు మహాసభలుప్రధాన కార్యదర్శి డా. జిల్లా. వి.పూర్ణ చంద్ మరియు పలమనేరు మున్సిపల్ కమీషనర్ యన్. వి. రమణా రెడ్డి, డా. మౌని ల చేతుల మీదగా ఆవిష్కరించారు.అనంతరం ఈ పుస్తకమును మండలి బుద్ధ ప్రసాద్ కి అంకితమిచ్చారు.సోమన్న పుస్తకాల ప్రదర్శనతో పాటు బహు గ్రంథకర్త గద్వాల సోమన్నను సన్మానించారు

# అర్హులైన వారికి... అక్రిడేషన్ కార్డులు జారీ చేయండి.

**జీవో నెంబర్ 252 ప్రకారం నియమ నిబంధనలు పాటించండి.**

**అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం.**



**మేడ్చల్ కలెక్టరేట్ ఏప్రిల్ 25:(వార్తా ప్రభ)**జిల్లాలో అర్హులైన వారికి అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని, జీవో నెంబర్ 252 ప్రకారం నియమ నిబంధనలు పాటించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు.నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరం లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జి ఓ ననుసరించి నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా అక్రిడిటేషన్ కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు కమిటీ సభ్యులు అక్రిడిటేషన్ ప్రక్రియ గురించి తమ అనుభవాలను పంచుకొని, ఈ ప్రక్రియ సజావుగా పారదర్శకంగా సాగే విధంగా పలు సూచనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా అదనపు కలెక్టర్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

# జిల్లాలోని ప్రతి రైతు... ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే చంద్రకళ**




**మేడ్చల్ కలెక్టరేట్ ఏప్రిల్ 25:(వార్తా ప్రభ)**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని రైతులందరూ రైతు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి, కే. చంద్రకళ తెలిపారు. మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్ల లోని రైతులు విధిగా ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ను అగ్రి స్టాక్ (తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ) లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఐడీతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధి నేరుగా పొందవచ్చని, పత్తి, వరి కొనుగోలు, పంట రుణాలకు ఇది కీలకంగా ఉంటుందన్నారు. బీమా, సబ్సిడీలు, ఇతర పథకాలు వేగంగా అందుతాయని, ప్రభుత్వం అందించే పథకాల పారదర్శకత పెరుగుతుందని చెప్పారు.రిజిస్ట్రేషన్ కు కావాల్సిన పత్రాలు ఆమె సూచించారు వరుసగా రైతులుఆధార్ కార్డు భూమి పట్టాపాస్ బుక్ ఆధార్ కు లింక్ ఐన మొబైల్ నంబర్ (ఓటీపీ కోసం) వెంట తెచ్చుకోవాలన్నారు.ఆయా మండలాల వారీగా రైతులు తమ పరిధిలోని అగ్రికల్చర్ ఏ.ఈ.ఓల వద్ద (రైతు వేదికలలో) లేదా దగ్గర లోని అన్నిమీ–సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు రావాలని సూచించారు.

# లీజు 'రొయ్య'కు రాజకీయ రంగు

- **లీజు చెల్లించని కారణంగా రొయ్యల రవాణా అడ్డు రైతు**
- **రైతులను తోసేసి లోడ్ ఎత్తికెళ్ళిన లిజ్ దారులు**
- **ఇరువర్గాల మధ్య బాహాబాహీ... పోలీస్ స్టేషన్లో రెచ్చిపోయిన వడ్డీలు కార్పొరేషన్ చైర్మన్**
- **జనసేన టిడిపి విభేదాలు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం**
- **ఇరు వర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు**




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25 (వార్తా ప్రభ ప్రతినిధి):** రొయ్యల చెరువు ఆర్థిక వ్యవహారాలపై రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం చినికి చినికి గాలివానలా మారింది. గత 20 రోజుల నుంచి జరుగుతున్న పంచాయితీ ఈ నెల 22న స్థానిక పోలీస్ స్టేషన్ కు చేరి రాజకీయ రంగు పులుముకుంది. పోలీసుల కథనం, సేకరించిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లపూడి గ్రామానికి చెందిన రైతు చిగురుపాటి వెంకట నారాయణకు ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలులో 10 ఎకరాల రొయ్యల చెరువు ఉంది. దీనిని ఎనిమిది సంవత్సరాలకు గుంటుపల్లికి చెందిన రేగళ్ల సాంబశివరావు, ఏలూరుకు చెందిన బలే లక్ష్మణరావుకు ఎకరాకు రూ.40 వేలు చొప్పున పది ఎకరాలను రూ.4 లక్షలకు (20023 ఏప్రిల్ నుంచి 2031 ఏప్రిల్ వరకు) లీజుకు ఇచ్చాడు. సాంబశివరావు, లక్ష్మణరావు చెరో నాలుగు సంవత్సరాలు రొయ్యలు సాగు చేసుకునేలా అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. 2023 నుంచి లక్ష్మణరావు రొయ్యల చెరువు సాగు చేస్తున్నాడు. 2027 నుంచి 2031 వరకు సాంబశివరావు సాగు చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే 2025 నవంబర్ నుంచి 2026 ఏప్రిల్ వరకు లక్ష్మణరావు సుమారు రూ.2 లక్షలు కరెంట్ బిల్లు, గడిచే ఆరు నెలలకు లీజు చెల్లించలేదు. అయితే ఈ నెల 22న లక్ష్మణరావు వర్గం రొయ్యల చెరువులో రొయ్యలు పట్టి తరలించే ప్రయత్నం చేస్తుండగా, విషయం తెలుసుకున్న రైతు వెంకట నారాయణ రొయ్యల చెరువు వద్దకు చేరుకుని తనకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకుండా రొయ్యల లోడు తీసుకెళ్లడానికి వీల్లేదని అడ్డం తిరిగాడు. దీంతో లక్ష్మణరావు వర్గీయులు రైతు వెంకట నారాయణపై దౌర్జన్యం చేయగా ఘర్షణ వాతావరణం ఏర్పడింది. రైతును లెక్కచేయని లక్ష్మణరావు, అతని వర్గం ఎనిమిది మంది లీజు, కరెంట్ బిల్లు చెల్లించకుండానే రొయ్యల లోడుతో వెళ్లిపోయారు. దీంతో రైతు వెంకట నారాయణ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుడు, అతనితో పాటు వచ్చిన గుంటుపల్లికి చెందిన రేగళ్ల సాంబశివరావు, శ్రీను, రఘుతో పోలీసులు మాట్లాడుతుండగా ఏలూరుకు చెందిన బలే లక్ష్మణరావు, అతని వర్గం పోలీస్ స్టేషన్ కు చేరుకుని హంగామా సృష్టించింది. లక్ష్మణరావు తరపున వచ్చిన రాష్ట్ర వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్, జనసేన పార్టీ దెందులూరు నియోజకవర్గ ఇన్ చార్జి ఘంటశాల వెంకట లక్ష్మి జోక్యం చేసుకుని పోలీసులను నిలదీశారు. ఆమె వేలు చూపిస్తూ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. పోలీస్ స్టేషన్ లో పోలీసుల సాక్షిగా రైతు వెంకట నారాయణ వర్గం, ఏలూరుకు చెందిన లక్ష్మణరావు వర్గం బాహాబాహీకి దిగడంతో పోలీసులు కలుగజేసుకుని రెండు వర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఇటు టీడీపీ, అటు జనసేన పార్టీల రంగు పులుముకుంది. రొయ్యల చెరువు ఆర్థిక వ్యవహారంలో తలెత్తిన వివాదం కూటమిలో చిచ్చు పెట్టేలా చేసింది. కాగా ఏలూరుకు చెందిన వర్గాలో బలే లక్ష్మణరావు, జయమంగళ రంగారావు, రూపవర్మ, సైదు ఏసురాజు, బలే వెంకటేష్, బలే ఈశ్వరరావు, మంగళ లీలా కృష్ణ, కె.పుష్పశ్రీ, తాటపూడి చందు, గుంటుపల్లికి చెందిన వర్గంలో రేగళ్ల సాంబశివరావు, రేగళ్ల శ్రీను, రేగళ్ల రఘుపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు ప్రారంభించారు.చలివేంద్రం ప్రారంభించిన అనంతరం పాదచారులకు, వాహనదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని వాసవి క్లబ్ నిర్వాహకులు తెలిపారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు ఈ సేవలు కొనసాగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ చిట్టిబాబు కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# పశుసంవర్ధక శాఖ అందిస్తున్న వైద్య సేవలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోండి

**-పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్ నాయుడు**

**-కవులూరు గ్రామంలో పశువైద్య శిబిరం**

**జి.కొండూరు: ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్ నాయుడు పేర్కొన్నారు.ఏప్రిల్ 25 ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, పశు సంవర్ధకశాఖ సంయుక్తాధ్వ ర్యంలో శనివారం ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధిలోని కవులూరు గ్రామంలో పశుపోషలకు పశువుల పెంపకం,పాల ఉత్పత్తి, పశువులకు సంక్రమించే వ్యాధులు, నివారణ తదితర అంశాలు పై అవగాహన సదస్సుతో పాటు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్ నాయుడు పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు.అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో దామోదర్ నాయుడు ప్రసంగించారు. పశుపోష కులు తమ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం పశువైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవాలని కోరారు.వ్యవసాయంలో పశుపోషణ కీలకమైన పాత్ర పోషిస్తోందని, రైతులకు వచ్చే ఆదాయంలో గణనీయమైన భాగం పశు పోషణ ద్వారా వస్తుం దన్నారు. పాడిపశువులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సూది మందులు, ఫీడ్ సప్లమెంటరీ, వ్యాక్సిలను అందిస్తుందని, వీటిని ఉపయోగిం చుకోవాలని తెలియజేశారు. పట్టణాల నుంచి గ్రామాల వరకు గతంలో ఇంటికి వచ్చిన వారికి మజ్జిగ ఇచ్చేవారని, ఇప్పుడు కూల్ డ్రింక్స్ ఇస్తు న్నారని వీటివల్ల ప్రజలు అనేక రోగాలపాలవుతు న్నారని అన్నారు.ఆరోగ్యమైన సమాజం తయారు కావాలంటే సహజసిద్ధమైన పాలు, మాంసం, గుడ్లు అవసరమని, వాటి ఉత్పత్తి పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని వెల్లడించారు.రసాయనాల తో కూడిన ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని క్రమంగా తగ్గించుకోవాలని, సహజసిద్ధమైన పశువుల ఎరువులను వాడటం ద్వారా నాణ్యమైన పంట ఉత్పత్తి అవుతుంది అని



తెలిపారు.

**పశువులకు అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి:**

**-పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.హనుమంతరావు**

పశువులకు అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయనీ, ప్రతి ఏడాది పశువుల సంరక్షణ కోసం పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.హనుమంతరావు తెలియజేశారు.పశు వైద్యులు అందిస్తున్న సేవల ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు.

**పశు పోషణ పేదవాళ్ళకి జీనోపాధిగా ఉంది: -కె వి వి ప్రసాద్** ఈ రోజుల్లో పశు పోషణ పేదవాళ్ళకి జీనోపాధిగా మారిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ అన్నారు. పశు సంపదను పెంచడంలోనూ, వాటి సంరక్షణలో పశువైద్యులు చేస్తున్న కృషిని అభినందించారు.పశు పోషణ ద్వారా వచ్చే ఉత్పత్తిని పెంచడంతో పాటు ఉపాధి పొందడా నికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకో వాలని రైతులను కోరారు.ప్రతి ఏడాది ఏప్రిల్ 4 వారంలో వచ్చే శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమన్నా రు.పశువైద్య దినోత్సవం సందర్భంగా రైతులోకం పత్రిక స్పెషల్ తీసుకొచ్చామని, అందులో పశు వైద్య నిపుణులతో కూడిన అనేక వ్యాసాలు ప్రచురించామని తెలిపారు.వీటిని అధ్యయనం చేయడం ద్వారా రైతులకు చాలా విషయాలు తెలుస్తాయని అన్నారు.గ్రామీణ సమాజానికి పాడి, పంట రెండు కళ్ళు లాంటివన్నారు. పశువైద్యశాఖ చేపడుతున్న పలు పథకాలను ఉపయోగించుకుని రైతులు లాభదాయకంగా పశుపోషను మలుచుకోవాలని కోరారు.

**రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి సంవత్సరం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని అధికారకంగా నిర్వహించాలి: పి.జమలయ్య** రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి సంవత్సరం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని అధికారకంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య అన్నారు. నోరులేని మూగ జీవాలకు వైద్యం అందించి వాటికి రక్షణకు కృషి చేస్తున్న పశువైద్యుల సేవలను కొనియాడారు. పశు వైద్యంలో విశిష్ట సేవలు అందించిన వారికి అభినందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో పశుసంపద అభివృద్ధికి బడ్జెట్లో తగిన నిధులు కేటాయించి అన్ని గ్రామాల్లో పశు వైద్యశాలలను ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న పశు వైద్యుల పోస్టులను భర్తీ చేయడం ద్వారా పశు వైద్యాన్ని మరింత మెరుగుపరిచి అందుబాటులో తీసుకురావాలని కోరారు.ఈ సదస్సులో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మాధవరావు, డిప్యూటీ డైరెక్టర్ డా.చంద్రశేఖర్, మైలవరం అసిస్టెంట్ డైరెక్టర్ హరి హరనాథ్, విజయడైరీ మేనేజర్ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.అలాగే డాక్టర్ సునంద, డాక్టర్ శ్రీకాంత్ తోపాటు పలు గ్రామాల పశు వైద్యులు, పాలసొసైటీ అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు అక్కినేని సత్యనారాయణ, గరిమెళ్ళ పూర్ణచంద్రరావు,చెరుకూరి శ్రీనివాసరావు, స్థానిక రైతు నాయకులు బుడ్డిరమేష్, తాటికొండ రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, చిలుకూరి వెంకట్రావు, గరిమెళ్ళ సాంబశివరావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ సెంటర్ కార్ స్టాండ్ తొలగింపుపై ఉద్రిక్తత.



**మచిలీపట్నం ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నంలోని బస్టాండ్ సెంటర్ ప్రాంతంలో శనివారం నగరపాలక సంస్థ చేపట్టిన తొలగింపు చర్యలు స్వల్ప ఉద్రిక్తతకు దారితీశాయి. ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, రహదారి విస్తరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం దృష్ట్యా అనధికారికంగా కొనసాగుతున్న కార్ల స్టాండ్‌ను వెంటనే తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా కార్ స్టాండ్ నిర్వహకులు, కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి అదుపులో ఉంచేందుకు పోలీసులు భారీగా మోహరించారు. తొలగింపుల సమయంలో పోలీసులు, కార్ స్టాండ్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. నగరపాలక సంస్థ అధికారులు నగర అభివృద్ధి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారి సౌకర్యాల మెరుగుదల కోసం ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు, తమ ఉపాధి కోల్పోతున్నామని కార్ స్టాండ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# 16 గోవులు స్వాధీనం చేసుకున్న మండల అధికారులు



**విస్సన్నపేట ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవులను ముందస్తు సమాచారం యజమానులకు మైకు ద్వారా తెలియజేసి తుది హెచ్చరికల అనంతరం వాటిని అదుపులో తీసుకోవడం జరిగింది అని ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఎస్ఐ అర్జున రాజు, ఈవో హరికృష్ణ కుమార్ లు తెలియజేశారు. జరిమానాతో 16 ఆవులను తీసుకు వెళ్ళవలసి ఉంటుందని వారి మీడియా సమావేశంలో చెప్పారు.

# శ్రీశైల దేవస్థానంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కుందన శ్రీ.....



**కృత్తివెన్ను ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీశైలంలో ఈ నెల 24 జరిగిన సంస్కృత కార్యక్రమా లలో కృతి వెన్ను మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పులగం యుగంధర్ కుమార్తె పులగం కుందనికశ్రీ కూచిపూడి నృత్య ప్రదర్శన లో పాల్గొంది. కుందనశ్రీ ప్రతిభకు గుర్తింపుగా శ్రీశైలం దేవస్థానం అధికారులు మెమొంటోను సర్టిఫికెట్ ను ప్రధానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా నృత్యాంజలి కూచిపూడి కళానిలయం హైదరాబాద్ డాన్స్ టీచర్ జ్ఞానేశ్వరి కుందనిక శ్రీ ప్రతిభకు గుర్తింపుగా జ్ఞాపికను బహుకరించి అభినందించారు.

# సీనియర్ పాత్రికేయులు అన్నవరపు బ్రహ్మయ్యకు విశ్వదాత 2026 అవార్డు



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్ర పత్రిక వ్యవస్థాపకులు. స్వాతంత్ర సమరయోధులు దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు స్మారకార్థం ప్రతి ఏడాది ఇచ్చే "విశ్వదాత అవార్డు" 2026 సంవత్సరానికి గాను పత్రిక రంగం నుండి సీనియర్ పాత్రికేయులు రచయిత అన్నవరపు బ్రహ్మయ్యకు అందిస్తున్నట్లు విశ్వదాత ఫౌండేషన్ చైర్మన్, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు మనవడు దేశోద్ధారక నాగేశ్వరరావు శనివారం ప్రకటించారు. ఈ అవార్డును దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు స్వగ్రామమైన పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలో 28వ తేదీ జరిగే కార్యక్రమంలో అందచేయనున్నట్లు తెలిపారు. గతంలో ఈ అవార్డును గాంధేయవాది వావిలాల గోపాలకృష్ణయ్య, సుప్రసిద్ధ సంపాదకులు పొత్తూరు వెంకటేశ్వరరావు, సినీ దిగ్గజం కె విశ్వనాథ్ వంటి ప్రముఖులు స్వీకరించారు. ప్రస్తుతం విశ్వదాత అవార్డు స్వీకరిస్తున్న బ్రహ్మయ్య నాలుగున్నర దశాబ్దాలుగా పలు దినపత్రికలలో పనిచేయటమే కాకుండా తెలుగు తోరణం వార్తా పత్రికకు సంపాదికునిగా వ్యవహరించారు. 11 గ్రంథాలను రచించారు. గతంలో వీరికి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి కీర్తి పురస్కారం, నార్ల వెంకటేశ్వరరావు విశిష్ట సేవా పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం, ఏపీఅధికార భాషా సంఘం మాతృ భాష సేవా శిరోమణి వంటి పలు పురస్కారాలులభించాయి.

# వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు



**కిర్లంపూడి ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేం చేసి ఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం శ్రీ వాసవి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి జరుగుతున్న పంచామృత అభిషేకం, కుంకుమార్చన, శ్రీ వాసవి వ్రతకల్పం వంటి కార్యక్రమాలు నిర్వహించబడును. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన భక్తులందరూ స్వీకరించి అమ్మవారి దీవెనలను పొందాలనికోరడమైనది.

# డీజిల్ సరఫరాపై ఆందోళన వద్దు: కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**అమలాపురం ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. గతంలో కంటే సాధారణంగానే సరఫరా జరు గుతున్నప్పటికీ, సామాజిక మాధ్యమాలలో ఇతర మాధ్యమాల్లో వస్తున్న అవాస్తవ, అసత్య ప్రచారాల వల్ల ప్రజలు భయాందోళనకు గురై, అవసరానికి మించి డీజిల్‌ను నిల్వ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నా రు. దీనివల్ల కృత్రిమ కొరత ఏర్పడుతోందని జిల్లా కలెక్టర్ స్పష్టం చే సారు. ప్రస్తుతం వరి కోతల సమయం కావడంతో కోత యంత్రాలకు ఒక్కసారిగా డీజిల్ అవసరం పెరిగింద న్నారు.ఆక్వా కల్చర్ రంగానికి విద్యుత్ కోతల నేపథ్యంలో రొయ్యల చెరువుల వద్ద ఏరియేటర్స్ నడపడానికి డీజిల్ వినియోగం అధికమైందన్నారు. ప్రస్తుత డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం,ఇండియన్ ఆయిల్



కార్పొరేషన్ కంపెనీలను జిల్లాకు సరఫరాను 10 శాతం పెంచాలని ఆదేశించడం జరిగిందన్నారు ఎక్కడా బంకులు డ్రై అవుట్ కాకుండా చర్యలు తీసు కుంటున్నామ విలేజ్ అగ్రికల్చరల్ జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ ప్రాజెక్టులు,వివిధ నిర్మాణ ప్రాజెక్టులకు ప్రత్యేక కేటాయింపులు చేయడమైందన్నారు. అవసరమైన వారు జిల్లా సివిల్ సప్లై అధికారి వారిని సంప్రదించ వచ్చున న్నారు.నిత్యావసర సేవలు సరుకులు రేషన్ షాపులకు తరలించే స్టేజ్-2 రవాణా వాహనాలకు ఎటువంటి అంత రాయం లేకుండా డీజిల్ సరఫరా చేయబడుతుంద న్నారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయ డమైనదన్నారు. డీజిల్ సర ఫరాలో ఎక్కడైనా సమస్యలు ఎదురైనా లేదా అధిక ధరలకు విక్రయించినా ఫిర్యాదు చేసేందుకు జిల్లా యంత్రాంగం రెండు ప్రత్యేక నంబర్లను ఏర్పాటు చేసిందని వాటి సెల్ 90599 20242, 94416 92275 లు ఉన్నాయన్నారు.జిల్లా ప్రజలు, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని ప్రకటన ద్వారా జిల్లా కలెక్టర్ తెలిపారు.

## జాతీయ రహదారిపై తిరుగుతున్న గేదెలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**వెంకటాపురంలోని పశువుల ఆసుపత్రికి తరలించిన పోలీసులు**
**గేదెల యజమానిపై పై చట్టపరమైన చర్యలు**



**జి.కొండూరు: ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇబ్రహీంపట్నం చత్తీస్గడ్ 30వ జాతీయ రహదారిపై తిరుగుతున్న మూడు గేదలను జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకొని వాటిని జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామంలోని పశువుల ఆసుపత్రికి తరలించారు.ఆ గేదల యజమాని ఎవరని పోలీసులు ఆరా తీయగా వెంకటాపురం గ్రామాని కి చెందిన యరమల శ్రీనివాస రెడ్డి విగా గుర్తించారు.సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని స్థానిక ఎస్ఐ
కె.సతీష్ కుమార్ తెలిపారు.

**గేదెలను కాపు కాసుకోవాలి :-ఎస్ఐ సతీష్ కుమార్**

గేదలను కాపు కాసుకోవాలని,అలాకాకుండా రోడ్లపైకి వదిలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సతీష్ కుమార్ జి.కొండూరు గ్రామంలోని పశుపోషకులను హెచ్చరించారు.గేదలు పగటి పూట గాని,రాత్రి వేళ రోడ్లపై తిరగటం వలన రోడ్ ప్రమాదాలు జరరుగుతాయని,దాని వలన ప్రాణ నష్టం కలుగుతుందన్నారు.రోడ్ ప్రమాదాలు నివారణ లో ప్రజలు కూడా పోలీసు వారితో సహకరించా లని కోరారు.ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, (ఐపీఎస్) ఆదేశాల మేరకు, రూరల్ డీసీపి లక్ష్మీనారాయణ( ఐపీఎస్) మార్గదర్శకత్వంలో శనివారం మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు కొత్తూరు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలియజేశారు.

## ఉపాధి హామీ కూలీల పట్ల నిర్లక్ష్యంపై కాంగ్రెస్ ధ్వజం

**కనీస అవసరాలు కల్పించలేని అధికారులు**

**కూలీల పొట్ట కొడుతున్న పాలకులపై ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్స్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఆగ్రహం**



**నందిగామ ఏప్రిల్ 25 (వార్తాప్రభ):**మండలం పరిధిలోని చందాపురం గ్రామ శివారులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక కూలీల సమస్యలను పరిశీలించడానికి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మ పిలుపు మేరకు కాంగ్రెస్ నాయకులు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నీరుగారుస్తున్నాయని, క్షేత్రస్థాయిలో కూలీల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. చందాపురంలో పని చేస్తున్న కూలీల కష్టాలను స్థానిక నాయకులు తో కలసి డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఒ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ మందా వజ్రాయ్య, స్థానిక నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా బొర్రా కిరణ్ మరియు మందా వజ్రయ్య లు మాట్లాడుతూ కూలీలకు కనీస సౌకర్యాలైన లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పని చేసే చోట చుక్క నీరు లేదు, తలదాచుకోవడానికి నీడ లేదు. కనీసం 'ఓఆర్ఎస్' ప్యాకెట్లు లేదా మెడికల్ కిట్‌లు కూడా లేకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ అని అన్నారు.ఈ వేసవి ఎండల్లో కష్టపడుతున్నా, కూలీలకు రావాల్సిన వేతనాలు సకాలంలో చెల్లించకపోవడాన్ని నాయకులు తప్పుబట్టారు.మండే ఎండల్లో ప్రాణాలకు తెగించి పని చేస్తున్న కూలీలకు రోజుకు కనీసం ?400 కూడా రాకపోవడం సిగ్గుచేటు. కేంద్ర ప్రభుత్వం నిధులను కుదించగా,రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణను గాలికి వదిలేసింది అని అన్నారు.కూలీలకు రోజుకు 600 రూపాయల వేతనం అందించాలని, ఎండ తీవ్రత దృష్ట్యా పని వేళల్లో వెసులుబాటు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కూలీ లకు మజ్జిగ మరియు బిస్కెట్స్ లు పంపిణీ చేశారు.బకాయి ఉన్న వేతనాలన్నింటినీ వడ్డీతో సహా తక్షణమే విడుదల చేయాలినీ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోపు నరేంద్ర, కనకపూడి వేంకటేశ్వరరావు, పెసరమల్లి శ్యాంబాబు,కొటారు రవి,మన్నెం వెంకటేశ్వరరావు , తుమ్మల నాగేశ్వరరావు, సూధల పూర్ణచంద్రరావు, నరికెత్తి శ్రీనివాసరావు మరియు మాజీ సర్పంచ్ గొంది సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.


## స్కాప్ షాప్ లో అగ్నిప్రమాదం

**అగ్ని మాపక సిబ్బంది రాక తో అదుపులో కీ వచ్చిన అగ్ని జ్వలలు**



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 25( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లో బారు ర హై స్కూల్ ప్రక్కనగల స్క్రాప్ షాప్ లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం. షాపులో ఎవరు లేకపోడం తో చుట్టూ ప్రక్కల వారి సహాయం తో పక్కనే వున్న కారు మెకానిక్ తుమ్మల శ్రీను తన వద్ద వున్న మోటారు నీళ్లతో మంటలు ఆ ర్పటాని చాల కృషి చే స్తుండగా జగ్గయ్యపేట అగ్ని మాపక వాహనం రావడం తో సిబ్బందికృషి తో మాట లు అదుపులోకి రావడం తో ప్రమాదం తప్పిందని చుట్టూ ప్రక్కల వారు ఊపిరి పిల్చు కున్నారు..

## 70వేలు నగదు మాయం - పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**సంగం ఏప్రిల్ 25(వార్తాప్రభ ప్రతినిధి)** ఇంట్లోని బీరువాలో దాచిన నగదును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారని మండలంలోని మర్రిపాడు గ్రామానికి చెందిన గొల్లపల్లి హజరత్తయ్య శనివారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాల మేరకు మర్రిపాడు అరుందతీయవాడకు చెందిన హజరత్తయ్య రైతు. ఇటీవల తాను పండించిన ధాన్యాన్ని అమ్ముకొనగా రూ.1.20 లక్షల నగదు వచ్చింది. అందులో రూ.50వేలు బయట ఉన్న బాకీలు చెల్లించగా 22వ తేది తన బీరువాలో మిగిలిన రూ.70వేలు నగదు ఉంచాడు. 23వ తేదీ వరకు బీరువాలో తాను పెట్టిన డబ్బులు ఉండగా 24వ తేది మధ్యాహ్నం భోజనం అనంతరం హజరత్తయ్య బయటకు వెళ్లగా అతని భార్య గ్రామానికి సమీపంలోని కావలి కాలువ వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లింది. దీంతో ఇంట్లో ఎవరూ లేరు. సాయంత్రం 4 గంటలకు బట్టలు ఉతుక్కొని తీసుకొచ్చిన అతని భార్య తలుపులు తాళాలు పగలగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా బీరువా తాళాలు వగలగొట్టి ఉన్నాయి. బీరువాలో నగదు కనిపించలేదు. దీంతో అంతా వెతికి శనివారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగం ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ వేంకటేశ్వర దర్శనానికి తండోపతండాలుగా భక్తులు...





**గుడ్లవల్లేరు: ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం తండోపతండాలుగా భక్తుల తాకిడి అధికమైంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తెలిపారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదాల్ని స్వీకరించారన్నారు. భక్తులకు వేసవి ఎండకు గురి కాకుండా ఉండేందుకు సుందర వన నందన వనంగా చలువ పందిళ్లు, మంచినీటిని కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

## గ్రామీణ వైద్యులు తమ పరిధికి మించ కింద ప్రాథమిక వైద్య సహాయం అందించాలి

**-లంక దాసరి ప్రసాద్ రావు.**



**గుడివాడ, ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆర్ఎంపీ వైద్యులు తమ తమ నియోజకవర్గాల శాసనసభ్యుల నుంచి ప్రశంసా పత్రాలను పొందాలని ఆర్ఎంపి, పి.ఎం.పి జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర గౌరవ సలహాదారు లంక దాసరి ప్రసాదరావు ఉద్ఘాటించారు. గుడివాడ డివిజన్ గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పై విధంగా అన్నారు. ప్రజల్లో సుపరిచితులైన ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల చట్టబద్ధత కొరకు జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్, అదేవిధంగా మరో గౌరవ సలహాదారు కర్నూలు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. అందుకు మూడు ఫెడరేషన్ల నాయకులు సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు . ఈ క్రమంలో గ్రామీణ వైద్యులు తమ పరిధికి మించకుండా ప్రాథమిక వైద్యం అందించాలన్నారు. స్థానిక రాజేంద్రనగర్ టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశానికి సభాధ్యక్షునిగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ వైద్యుల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నందూరి ఉమాశంకర్ ప్రధాన కార్యదర్శి దాసు వెంకట నాగేశ్వరరావు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోలా వెంకటేశ్వరరావు, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలా సింహాచలం, కోశాధికారి మేడూరి రమేష్ బాబు, ఏరియా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికాలు పంగా ఎర్రం నాయుడు, అగ్నిహోత్రం ఫణి గోపాల్, చీకుర్తి ప్రదీప్ కుమార్,పిఆర్వో కలగంటి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుదే నాగ చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి నాగేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్లంకి రాంబాబు, నందిగామ డివిజన్ కార్యదర్శి మంద బసవరాజు, కోశాధికారి షేక్ రంజాన్,అధ్యక్ష, కార్యదర్శులు శాంతకుమారి,పోతురాయి దిలీప్ కుమార్, కంబాల శ్రీనివాస్,చల్లా చంద్రశేఖర రావు, నండూరి శ్రీనివాస్ తో పాటు 300 పైగా గ్రామీణ వైద్యులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

## అనారోగ్యంతో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి "హెల్పింగ్ హ్యాండ్స్" ఆర్థిక సాయం.

**ఆర్జీయూకేటీ డైరెక్టర్ ఆచార్య ఎస్. గోపాలరాజు చేతుల మీదుగా నగదు పంపిణీ.**



**నూజివీడు: ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఆదుకునేందుకు "హెల్పింగ్ హ్యాండ్స్" సంస్థ ముందుకు రావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. క్యాంపస్‌లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డు కరక రవికుమార్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, రామకూరి మేరీ కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతున్నారు. వీరి దీనస్థితిని గమనించిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తక్షణ సహాయంగా, రవికుమార్‌కు రూ. 10,000/- లు, మేరీకి రూ. 5,000/- లు, ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ నగదును శనివారం క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య ఎస్. గోపాలరాజు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న తోటి సిబ్బందిని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులను, విద్యార్థులను అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణరావు, డీన్ చిరంజీవి, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రెసిడెంట్ రఘు, జనరల్ సెక్రటరీ మధు, ఫ్యాకల్టీ సభ్యులు కృష్ణ కిషోర్, శ్రీహరి, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుపై 5% రాయితీ ఎర్లీ బర్డ్ పథకాన్ని వినియోగించుకోండి -. ఉప కమిషనర్ చాముండేశ్వరి.



**కూకట్ పల్లి,ఏప్రిల్ 25(వార్తాప్రభ):**ప్రభుత్వం అందిస్తున్న ఆస్తి పన్ను ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆల్విన్ కాలనీ సర్కిల్- ఉప కమిషనర్ చాముండేశ్వరి పన్ను చెల్లింపుదారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ కల్పిస్తున్న నేపథ్యంలో, ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని హైదర్ నగర్, భాగ్యనగర్, శంషిగూడ, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్, వెంకటేశ్వర నగర్ డివిజన్లలోని ప్రజలు ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని కోరారు.ఎర్లీ బర్డ్ పథకం కింద రూ.30 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటికే రూ.15 కోట్లు వసూలైనట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ చివరి తేదీ కావడంతో, మిగిలిన పన్ను చెల్లింపుదారులు ఆలస్యం చేయకుండా తమ ఆస్తి పన్నులు చెల్లించి 5 శాతం రాయితీని పొందాలని సూచించారు.ప్రజలు ముందుగానే పన్నులు చెల్లించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా, అభివృద్ధి కార్యక్రమాలకు కూడా తోడ్పడుతుందని ఆమె పేర్కొన్నారు.

## ప్రపంచ శాంతికి అడుగులు వెయ్యాలి

**ఇరాన్ దౌత్యవేత్త డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి ను కలసిన అల్తాఫ్ బాబా**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రపంచ శాంతికి అడుగులు వేయాలని ఇరాన్ దౌత్యవేత్త డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి కు సూఫీ మత గురువులు మరియు రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ భారత దేశ స్నేహబంధం మరింత బలపడాలని ఆయనను కోరారు. శనివారం నాడు విజయవాడలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. వారి మధ్య ఆత్మీయ సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా అల్తాఫ్ బాబా మజీద్ హకీమ్ తో ప్రపంచ శాంతికి దూతగా అడుగులు వేయాలని, అమరావతిలో జరిగే భారీ సూఫీ కాన్ఫరెన్స్ గురించి వివరించారు. అందులో భాగస్వామ్యం కావాలని కోరారు.అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి దౌత్యవేత్త మజీద్ హకీమ్ మాట్లాడుతూ సున్ని-షియా తెగలు వేరైనా ముస్లింలు ఒక తాటిపైకి వచ్చి ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇరాన్ భారతదేశముతో భవిష్యత్తులో కూడా తమ స్నేహం కొనసాగుతుందన్నారు. ఈ రెండు దేశాలు చారిత్రాత్మక స్నేహం సంబంధాలు దశాబ్దాల నాటివి, శాంతి అభివృద్ధి మానవతా విలువలు కాపాటంలో ఈ రెండు దేశాలు కీలక పాత్ర త్వరలో కొండపల్లి షాబుఖారీ ఆస్థాను సందర్శిస్తారని హామీ ఇచ్చారు. అమరావతిలో ఆల్ ఇండియా సూఫీ కాన్ఫరెన్స్ ఏర్పాటు శుభ పరిమణామాలు అని తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు మునీర్ అహ్మద్ ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ, మైనారిటీ నాయకులు వాజిద్ ఖాన్, మీర్ హుస్సేన్ జర్నలిస్ట్ షఫీ,ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ మహిళా సమైక్య సమావేశం



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యం లో టౌన్ లెవల్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రెసిడెంట్ మతి చుట్టుకుదురు వెంకటేశ్వరమ్మా అధ్యక్షత వహించారు. సమావేశంలో పట్టణంలోని వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, కమిటీ సభ్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల అభివృద్ధి, ఆర్థిక స్వయం సమృద్ధి, బ్యాంకు లింకేజీలు, మరియు ఇతర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వివరించారు. మెప్మా సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మిషన్ మేనేజర్ పమిడిపాటి వెంకట శ్రీధర్,రిటా, సి ఓ లు, ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు.

## రింగ్ సెంటర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**రోడ్డు విస్తరణకు కలెక్టర్ ఆదేశాలు**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి నేషనల్ హైవేపై ట్రాఫిక్ రద్దీ దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ బస్ స్టాప్ వరకు ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బండ్లు, చిరు వ్యాపార దుకాణాలను తొలగించి రోడ్డును విస్తరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఫుట్‌పాత్‌పై ఇరువైపులా పండ్లు,అమ్మే తోపుడు బండ్లు ఇరుకుగా ఉండటంతో రోడ్డు కుంచించుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు.ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు,నేషనల్ హైవే అధికారులు,ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ. సుబ్రహ్మణ్యం,ట్రాఫిక్ ఆర్ ఎస్ ఐ నరేష్ ,కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.ఫుట్‌పాత్ ఆక్రమణలను ఎలా తొలగించాలి, రోడ్డు విస్తరణ పనులను ఎలా చేపట్టాలనే అంశంపై చర్చించారు.ఫుట్‌పాత్‌పై ఉన్న అక్రమ కట్టడాలు, తోపుడు బండ్లను తొలగించి రోడ్డు విస్తరణ పనులు సోమవారం నుండి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.విస్తరణ తర్వాత చిరు వ్యాపారులకు అవకాశం కల్పిస్తాం అన్నారు.

## జల జీవన్ పథకం లో రెండు మంచి నీటి బోర్లు



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 25( వార్త ప్రభ )** జల జీవన్ మిషన్ మంచినీటి పథకంలో భాగంగా పెనుగంచిప్రోలు మునేరు అవతల వాటర్ షెడ్ దగ్గర నూతనం గా రెండు బోర్లు వేయుటకు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాంచారయ్య, పంచాయతీ ఈవో శ్యామ్ కుమార్ మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు మాజీ ఉత్సవ కమిటీ సభ్యుడు రమేష్ సచివాలయ సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలువల మరమ్మతులపై వెంటనే చర్యలు తీసుకోండి

**ఆత్మకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి**



**ఆత్మకూరు ఏప్రిల్ 25 ( వార్తా ప్రభ)** జిల్లాలో రానున్న పంట కాలానికి సాగునీటిని విడుదల చేసే లోపు కాలువల పూడికతీత మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రైతులకు సమయానికి సాగునీరు అందాలంటే ముందస్తు చర్యలు అత్యవసరమని స్పష్టం చేశారు.రెండో పంటకు సాగునీరు విడుదల నేపథ్యంలో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో జలాశయంలో ప్రస్తుతం ఉన్న 58 టీఎంసీల నీటిలో 49 టీఎంసీలను వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దాదాపు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసిన ఈ సమయంలో కాలువలు సక్రమంగా లేకపోతే నీరు చివరి దాకా చేరక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో వచ్చిన మెంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న కాలువలు చెరువుల మరమ్మతుల కోసం ఆత్మకూరు నియోజకవర్గంలో 199 పనులకు ఎఫ్‌డీఆర్ నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ ఆ పనులు ఎంత మేరకు పూర్తయ్యాయో అధికారులు ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.సుమారు రూ.10 కోట్లకు పైగా వ్యయంతో ఎఫ్‌డీఆర్ పనులు ప్రతిపాదించినట్లు తెలిసినా ఏ మండలంలో ఎలాంటి పనులు చేపట్టారు.వాటి పురోగతి ఏమిటో స్పష్టత ఇవ్వాలని అన్నారు. అనంతసాగరం మర్రిపాడు ఏఎస్‌పేట సంగం చేజర్ల మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే 165 చెరువులను తక్షణమే పరిశీలించి సాగునీరు ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రణాళికాబద్ధంగా పనులు వెంటనే ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మేకపాటి విక్రమ్ రెడ్డి కోరారు.

## ప్రపంచ మలేరియా పై అవగాహన ర్యాలీ



**ఆత్మకూరు ఏప్రిల్ 25 (వార్తా ప్రభ)** ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని ఆత్మకూరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మహిమలూరు నందు డాక్టర్ దేవానంద్ మరియు డాక్టర్ అనూష కుమారి ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సిబ్బందికి సమావేశము నిర్వహించి మలేరియా గురించి వివరించారు.డాక్టర్ దేవానంద్ మాట్లాడుతూ 2030 కల్లా మలేరియాను భారతదేశంలో పూర్తిగా నిర్మూలించాలని ఉద్దేశంతో వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటుందని తెలియజేసినారు.ఈ మలేరియా వ్యాధి మన భారతదేశంలో నాలుగు రకాలుగా ఉంటుందని ఇందులో ఫ్లస్ మోడియం పాలసీ ఫారం అనే రకం చాలా ప్రమాదకరమైనవిని సకాలంలో వ్యాధిని గుర్తించి తగు చికిత్స తీసుకోవాలని తెలియజేసినారు ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ పిహెచ్ఎన్ సూపర్వైజర్లు హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు ఆశ వాలంటీర్లు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

**గుడివాడ 15వ వార్డు గుడ్‌మెన్ పేటలో ఎమ్మెల్యే రాము ప్రజా దర్బార్..**



**గుడివాడ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక 15వ వార్డు గుడ్‌మెన్ పేటలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ వార్డు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల వద్ద నుండి ఎమ్మెల్యే 139 అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులతో మాట్లాడి పలు సమస్యలను ఎమ్మెల్యే రాము తక్షణమే పరిష్కరించారు. ఆర్థికపరమైన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజా దర్బార్ లో పాల్గొన్న ప్రజలు.. ఎమ్మెల్యే రాము కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, టిడిపి నాయకులు కంచర్ల సుధాకర్, చేకూరు జగన్మోహన్రావు, 15వ వార్డు టిడిపి నాయకులు వేశపోగు ఇమ్మానుయేలు, యేసుబు, నారీ చిన్నా, గూడూరి సురేంద్ర కుమార్, పాపారావు, అద్దంకి మాణిక్యాలరావు, సాగర్, సామ్రాట్, సుందరయ్య, బాల, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలోఉచిత మజ్జిగ పంపిణీ..



**గుడివాడ : ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శనివారం విజయదుర్గ మహిళా వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 204 గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరాన్ని గౌరీ శంకర్ చిన కార్ల సెంటర్, బస్టాండ్ వద్ద ప్రారంభించి 500 మందికి పాదచార్లకు, ఆటో రిక్షా కార్మికులకు, ప్రయాణికులకు వేసవి తాపాన్ని తీర్చడానికి చల్లని మజ్జిగను అందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మహిళ వాకర్ సభ్యులకు గవర్నర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీలారాణి, కార్యదర్శి డి. పద్మావతి, కోశాధికారి ఎ. రూప, జిల్లా పిఆర్ఓ మరియు ఎన్టీఆర్ స్టేడియం మహిళా వాకర్స్ అధ్యక్షురాలు జెవివి కుమారి, జిల్లా కార్యదర్శి అర్జా ప్రసాద్, మెరుగుమాల శివరామకృష్ణ, దేవి, జోతి, ప్రసున్న, విస్సు, ప్రసున్నాంబ, భాగ్యశ్రీ, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

# నగరం అందంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**







**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరం అందంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, కెనాల్ రోడ్డు, ఎంజీ రోడ్ ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని అందంగా ఉంచితే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, రహదారుల్లో పెట్టిన మూడు చెత్తబుట్టలు కచ్చితంగా ఉన్నాయా లేవా వాటిపైన ఏ చెత్త వెయ్యాలి అని చూపించే స్టిక్కర్లు సరిగ్గా ఉన్నాయా లేదా, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి ఏమైనా లోపాలు ఉంటే వెంటనే సరి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తరచుగా వ్యర్థాలు ఎక్కువగా వేసే ప్రదేశాలలో ( గార్బేజ్ వల్లరబుల్ పాయింట్స్) అందంగా పెయింటింగ్లు వేసి హరితాన్ని పెంచి, అందమైన ప్రదేశంగా మార్చాలని ఇంజనీరింగ్, హార్టికల్చర్, ప్రజారోగ్యం విభాగం సమన్వయంతో ఈ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర అందానికి భంగం కలిగించే కేబుల్ వైర్లు, ఫ్లెక్సీలు బ్యానర్లు పట్టణ ప్రణాళిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తొలగించాలని ఆదేశించారు.

# ఇంద్రకీలాద్రి పై దుర్గగుడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

**నమూనా మాస్టర్ ప్లాన్ ను రూపొందించిన ఆకుల శ్రీనివాస్ కుమార్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 25: (వార్తా ప్రభ ప్రతినిధి)** భక్తులకు కొంగుబంగారమైన విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై వేంచేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇంద్రకీలాద్రిని అత్యంత అద్భుతమైన రీతిలో అభివృద్ధి చేయవచ్చు అంటూ తన ఆధ్వర్యంలో రూపొందించిన ఒక మాస్టర్ ప్లాన్ ను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంజనీరింగ్, టెక్నికల్ టీం ల సహకారంతో ఈ మాస్టర్ ప్లాన్ ను రూపొందించడం జరిగిందని ఆయన వివరించారు. పురాణేతిహాసాల ప్రకారం కీలుడు అనే యక్షుడు ,అలాగే ఇంద్రుడు తపస్సు చేసినందున వీరిద్దరి పేరుపై ఇంద్రకీలాద్రి అన్న పేరు ఈ పర్వతానికి వచ్చిందని తెలిపారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు విచ్చేస్తారని , ఇది శక్తి పీఠాలలో ఒకటి అని భక్తులు భావిస్తారని తెలిపారు. దుర్గగుడి ఆధ్యాత్మిక శోభ,ప్రకృతి సౌందర్యం, కృష్ణా నది సోయగం కలిసిన ఇంద్రకీలాద్రి అభివృద్ధి ఎంతో ముఖ్యమైనదని ఆకుల శ్రీనివాస్ వివరించారు. పరిసరాల కు ఇబ్బంది లేని రీతిలో భక్తుల కోసం రోప్‌వే / ఎలివేటర్ నిర్మించవచ్చు అన్నారు. పార్కింగ్, భక్తులకు వసతి గృహాలు, చిన్న ఉద్యానవనాలు ఏర్పాటు చేస్తే దుర్గగుడి ప్రాంగణం మరింత సుందరంగా మారుతుందని పేర్కొన్నారు. వీటిని గర్భగుడికి దూరంగా ప్రధాన ఆలయ ప్రదేశాన్ని తాకకుండా నిర్మిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఇంద్రకీలాద్రి మొత్తం విస్తీర్ణం సుమారు 250 -- 300 ఎకరాల మధ్య విస్తరించి ఉందని, ఈ విస్తీర్ణంలో కొండ మొత్తం భాగం,ప్రకృతి ప్రాంతం,రోడ్లు, ఘాట్ మార్గాలు,ఆలయ పరిసరాలు అన్నీ కలిపి ఉన్నాయని చెప్పారు. శ్రీ కనకదుర్గమ్మ ఆలయానికి నేరుగా ఉపయోగంలో ఉన్న ప్రదేశం సుమారు 15 -- 25 ఎకరాలు ఉంటుందని అంచనాగా పేర్కొన్నారు. దీనిలో గర్భగుడి,




ప్రధాన ఆలయం ప్రాంగణం, క్యూలైన్లు, మండపాలు,ఉప ఆలయాలు, దేవస్థానం కార్యాలయాలు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం కొండ విస్తీర్ణం 250--300 ఎకరాలు ఉంటే ఆలయ వినియోగం కేవలం 15--25 ఎకరాలు మాత్రమే అని ఆకుల శ్రీనివాస్ వివరించారు. అంటే కొండలో 80--90 శాతం ప్రాంతం ఇంకా ప్రత్యక్ష ఆలయ వినియోగంలో లేదన్నారు. ఈ కాళీ ప్రాంతంలో క్యూ లైన్స్ మెరుగుదల,షెల్టర్, ఫ్యాన్లు, నీటి సదుపాయం, బఫర్ జోన్, ఆలయం చుట్టూ 100--300 మీటర్ల పరిధి యాత్రికుల సౌకర్య జోన్ గా అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. కొండ మధ్యభాగం / స్లోప్ ప్రాంతంలో భక్తుల వసతి గృహాలు,పార్కింగ్ (మల్టీలెవల్ చిన్న స్థాయిలో), ఫుడ్ కోర్టు, స్టెప్ వైస్ టెర్రస్ నిర్మాణం, ఎలివేటర్ / రోప్‌వే తదితర అనేక సౌకర్యాలు కల్పించవచ్చని వివరించారు. ముఖ్యంగా కొండను పూర్తిగా కట్ చేయకుండా "స్టిల్ట్" (పిల్లర్ల మీద) నిర్మాణాలు చేయాలని,ఇది మెయిన్ డెవలప్మెంట్ జోన్ అవుతుందని తెలిపారు. ఇక్కడ ఆడిటోరియం,హరికథ, భజన కార్యక్రమాలు,అన్నదానం హాళ్లు ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. కనెక్టివిటీ ప్లాన్ మెరుగుదల లో భాగంగా ప్రస్తుత ఘాట్ రోడ్ అభివృద్ధి, ప్రత్యేక బస్సుల సేవలు, రోప్‌వే వంటివి ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. పర్యావరణ హితంగా కనీసం 60--70% ప్రాంతం గ్రీన్‌గా ఉంచాలని తెలిపారు.రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లాస్టిక్ ఫ్రీ జోన్ గా రూపుదిద్దాలని కోరారు. ఇంద్రకీలాద్రి దుర్గగుడిని"కొండను మార్చకుండా --- కొండకు అనుగుణంగా అభివృద్ధి" అనే చక్కటి నినాదంతో అభివృద్ధి చేయాలని ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు పుస్తకాలను చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది

**-రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు**



**విజయవాడ, ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గత 45 ఏళ్లుగా గ్రంథాలయాల పరిరక్షణకు, విద్యార్థులకు పుస్తకాలను చేరువ చేయడానికి ప్రభుత్వం తరపున ఎంతో కృషి జరుగుతుందని రాష్ట్ర గ్రంధాలయం సంస్థ అధ్యక్షుడు కోటేశ్వరరావు అన్నారు.ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో ప్రఖ్యాత రచయిత, కృష్ణా జిల్లా రచయిత ల సంఘ అధ్యక్షుడు డాక్టర్ జీ. వీ. పూర్ణచంద్ గాధా శతి ' అనే పేరుతో పుస్తక పండుగ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల మంగళగిరిలో గ్రంధాలయాన్ని ఎ. సి. గదులతో అత్యంత ఆధునికరణ చేశామన్నారు. అదేవిధంగా ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేస్తామని ఈసందర్భంగా పేర్కొన్నారు. పాయకాపురం ప్రభుత్వ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మహిళా విభాగపు రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పామర్తి లీలావతి మాట్లాడుతూ ప్రఖ్యాత ఆంగ్ల రచయిత విలియం షేక్స్పియర్ జన్మదినం మరియు మరణ దినం ఒకే రోజైన ఏప్రిల్ 23 ను పుస్తక దినోత్సవంగా యునెస్కో ప్రకటించిందన్నారు. ఇది ఒక కారణమైతే 156 పుస్తకాల రచయితగా, ఆయుర్వేద డాక్టర్ గా రోజువారి ఆహారం గురించి నిరంతర పరిశోధకులు అయిన డాక్టర్ జి వి పూర్ణచంద్ పుట్టినరోజు కూడా పుస్తక పండుగ రోజే కావడం విశేషమన్నారు. పుస్తకం లేకపోతే సంస్కృతి, వారసత్వం ఒక తరం నుండి ఇంకొక తరానికి ప్రవహించే జ్ఞాన ప్రవాహం ఆగిపోతుందని అన్నారు. పూర్ణ చంద్ జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసి, వారిని డాక్టర్ పామర్తి లీలావతి దుశ్శాలువాతో సత్కరించారు. జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు షేక్ భాషా మాట్లాడుతూ విజయవాడ చదువుల రాజధానిగా వెలుగొందడానికి విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని మరింత సామాజిక దృక్పథంతో అభివృద్ధి చెందాలని కోరారు. డాక్టర్. జీ. వి. పూర్ణచంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పుస్తకాల ఆవశ్యకతను పెంపొందించడానికి ప్రఖ్యాత రచయిత తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ పేర సెప్టెంబర్ 10 ని రాష్ట్ర పుస్తక దినోత్సవం గా జరిపి వారి స్వగ్రామమైన నందమూరులో వారి గృహాన్ని పునరుద్ధరించి వారి జ్ఞాపకాలతో, వారి పుస్తకాలతో చక్కటి స్మారకంగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. పుస్తకం గురించి కవితలు, ప్రసంగాలు చేసిన కవులను శాలువా, మెమొంటో, పుస్తక కానుకలతో సత్కరించారు. ప్రాఖ్యాత రచయితలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ సుబ్బారావు, అనేక మంది కవులు పాల్గొన్నారు. కొండపల్లి ప్రభుత్వ పాఠశాల విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

# సోలార్ అవేర్నెస్ 1కే ర్యాలీ

**'రన్ సన్' - శక్తి సంరక్షణకు యువత**

**1కే రన్ లో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే**

**నందిగామ ఏప్రిల్ 25 (వార్తాప్రభ):** సుస్థిర అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్‌లో క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు ఎన్ ఎస్ ఈ ఫ్రెండ్ క్యాప్ మరియు పిజిఎల్ రేనీవేబుల్స్ సంయుక్తంగా నిర్వహించిన 'రన్ సన్– రన్ టుడే, పవర్ టుమారో' సోలార్ అవేర్నెస్ 1కే ర్యాలీ కార్యక్రమం శనివారం విజయవంతంగా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువత మరియు సామాన్యులలో సౌర శక్తి ప్రాముఖ్యతను, పర్యావరణ సంరక్షణను, శక్తి సంరక్షణను అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. "క్లీన్ ఎనర్జీ ఫర్ సస్టైనబిలిటీ" అనే థీమ్‌తో ఈ మారథాన్ రాష్ట్రంలో సుస్థిర భవిష్యత్తుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రశంసా పత్రాలు అందజేత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మరియు అధికారులను గౌరవించడం కోసం స్థానిక కాకాని నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయ ఆవరణలో ప్రత్యేక స్టేజ్ ఏర్పాటు చేశారు.ఈ స్టేజ్‌పై



కూటమి నేతలు, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి తంగిరాల సౌమ్య విద్యార్థులు మరియు పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సౌమ్య గారు సోలార్ ఎనర్జీ వినియోగం పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు శక్తి సురక్షితం చేయాలని పిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా యువతలో పర్యావరణ ప్రేమ, సౌర శక్తి వైపు మొగ్గు పెంచడం జరిగిందని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని స్థానికులు, విద్యార్థులు అభిప్రాయపడ్డారు

# బడి ఈడు పిల్లల్ని హిందూ హైస్కూల్లో చేర్పించండి..




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 25:- (వార్తా ప్రభ ప్రతినిధి)** అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆధునాతన విద్యా సంబంధ పరికరాలు ఉన్న స్థానిక ఎస్ కే పి వి వి హిందూ హైస్కూల్లో బడి ఈడు పిల్లల్ని చేర్పించాలని స్థానిక 52 వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) సూచించారు. ప్రభుత్వ విద్యాశాఖ, మేనేజ్మెంట్ ఆదేశానుసారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు గత రెండు రోజులుగా ఇంటింటికి తిరుగుతూ హిందూ హై స్కూల్ లో విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, సౌకర్యాలును ( యన్ సిసి,స్పోర్ట్స్, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ ) గురించి ప్రజలకు వివరిస్తున్నారు. శనివారం స్థానిక మల్లికార్జునపేట ఉమ్మడి చంటి వాటర్ ప్లాంట్ వద్ద నుంచి ఇంటింటి కార్యక్రమాన్ని కార్పొరేటర్ చంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. సుమారు 125 సంవత్సరాల చరిత్ర కలిగిన హిందూ హైస్కూల్ నగరానికి తలమానికంగా ఉందన్నారు. ఒకప్పుడు నగరానికే విద్యాబుద్ధులు నేర్పిన సంస్థగా పేరుంది అన్నారు. అటువంటి పాఠశాలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, వి అరుణకుమారి, జే ఆనందకుమార్, ఎస్ శ్రీనివాసరావు, జి పురుషోత్తం, ఐ శశికళ, కె కృష్ణ, పణి, బి బ్రహ్మేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## బెజవాడ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న సినీ హీరో అడివి శేషు



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అడవి శేషు, ప్రముఖ యువ సినీ హీరో ఇటీవల వారి చిత్రం పేరు ""డేకాయిట్ "" ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శన జరుగుచున్న సందర్భముగా శ్రీ అమ్మవారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకుని ఉన్నారు.

## టి వి సీరియల్ నటులు సాయి కిరణ్ కి యేమినేని రచనలు అందజేత



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రముఖ బుల్లితెర నటులు సాయి కిరణ్ కి సీనియర్ జర్నలిస్టు,రచయిత యేమినేని వెంకట రమణ రచించిన ""జర్నలిస్టుగా నా జ్ఞాపకాల సవ్వడి"" ""రమణీయం"" పుస్తకాలు అందించారు. ప్రముఖ టి వి లో ""నువ్వు లేక నేను లేను"" ప్రధాన భూమిక పోషిస్తున్న సీరియల్ టి వి నటుడు సాయి కిరణ్ బెజవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చారు. అనంతరం విజయవాడలో పోతిన చిన్నా నగర్ లో నివాసముంటున్న సీనియర్ జర్నలిస్టు,రచయిత యేమినేని వెంకట రమణ ఇంటికి సాయి కిరణ్ తన కుటుంబ సభ్యులతో వచ్చారు. మాట మంతి అనంతరం యేమినేని సతీ సమేతంగా సాయి కిరణ్ కి తన రచనలు పుస్తకాలు అందించారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు




**గుడివాడ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** శ్రీశ్రీశ్రీశ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 55వ వార్షిక ఆరాధనా మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం సాయంత్రం 7గంటలకు దేవస్థానం ఆవరణలో ఆలూరు నాగశ్రీ నివేదిత, వారాహి డ్యాన్స్ అకాడమీ లక్కోజు కనక మహాలక్ష్మి శరణ్య, ధాత్రి, ఆరేపల్లి వేదశ్రీ, ఆత్మకూరి పూర్ణ శ్రావ్యశ్రీ చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యదర్శి రాచకుళ్ళ సురేష్ బాబు, యలమర్తి కోటేశ్వరరావు అమృతలూరు పిచ్చేశ్వరరావు భవిరి శంకరనాథ్ ఆముదాలపల్లి గోవర్ధనాచారి లక్కోజు శివప్రసాద్ పెదపాటి రవి కుమార్ పాలూరి సూరిబాబు ఆలూరు నాగేశ్వరరావు చోడవరపు దేవి ప్రసాద్ లు పాల్గొన్నారు. అలాగే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేసారు.

# వడదెబ్బనుండి తప్పించుకోవటం ఎలా ?



**గుంటూరు టౌన్ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్ర ప్రదేశ్ భూమధ్య రేఖా ప్రాంతానికి చేరువలో ఉన్న రాష్ట్రం. అసలే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ప్రదేశం. అందులోనూ వేసవి కాలం... దీనికి తోడు పర్యావరణాన్ని కలుషితం చేస్తూ... మన చేత మనంత రెచ్చగొట్టబడుతున్న ఉష్ణోగ్రత మనపైనే పగ తీర్చుకుంటానంటోంది. ఫలితంగా వాతావరణ ఉష్ణోగ్రత ,మానవ, జంతు జాలాల సాధారణ జీవన స్థాయికి భంగకరంగా మారింది. అందువలన అనేక ఆరోగ్య రుగ్మతలు ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చే పరిస్థితులకు దారితీస్తున్నాయి. అంతేకాదు అనేకమంది ప్రాణాలను ఏటా బలి తీసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో చిన్నచిన్న ముందు జాగ్రత్తలు పెద్దపెద్ద ప్రాణాపాయ ప్రమాదాలను తప్పించగలవు. ఆ జాగ్రత్తలేమిటో ఇప్పుడు మనం తెలుసుకుందాం .మానవ శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 37° సెంటిగ్రేడ్ (98.6 ఫారిన్ హీట్) ఉంటుంది. వేసవికాలంలో వాతావరణ ఉష్ణోగ్రత శరీర ఉష్ణోగ్రతను దాటిపోతుంది. మన రాష్ట్రంలో సుమారు 42 నుంచి 50 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదవుతుంది . బయట ఉష్ణోగ్రత ను బట్టి శరీర ఉష్ణోగ్రత పెరగకుండా అదే స్థాయిలో నియంత్రించే యంత్రాంగం మన దేహంలో ఉంటుంది. ముఖ్యంగా ఈ యంత్రాంగాన్ని స్వేద గ్రంధులు చర్మం ద్వారా నియంత్రిస్తాయి. చర్మంలో అసంఖ్యాకంగా ఉన్న స్వేద గ్రంధులు చెమటను ఉత్పత్తి చేస్తాయి. ఈ చెమట ఆవిరి అయిపోవడానికి కావలసిన ఉష్ణోగ్రతను శరీరం నుండే గ్రహిస్తుంది. అందువల్ల శరీర ఉష్ణోగ్రత క్రమ పద్ధతిలో నియంత్రించబడుతుంది. చెమటతో పాటు సోడియం, క్లోరైడ్ వంటి లవణాలు కూడా బయటకు పోతాయి. సాధారణంగా శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది .ఈ నీరు చెమట ద్వారా అధికంగా బయటకు పోవడం వల్ల ఉష్ణోగ్రత నియంత్రణ యంత్రాంగానికి విఘాతం గలుగుతుంది .ఫలితంగా శరీర ఉష్ణోగ్రత అదుపుతపుతుంది. ఈ విధంగా శరీర ఉష్ణోగ్రత అదుపు తప్పి నీటిని కోల్పోవడం వల్లనే వడదెబ్బ తగులుతుంది .

**వడదెప్పను ఎలా గుర్తించాలి ?** వడదెబ్బ తగిలినప్పుడు శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చర్మం పొడిగా ఎర్రబారినట్లు కనిపిస్తుంది. దాహం వేస్తుంది. అలసట, ఆయాసం ఉంటాయి. పెదవులు, నాలుక తడి ఆరిపోతాయి. మగతగా ఉంటుంది. తలనొప్పి ఉండవచ్చును. వికారంగా ఉంటుంది. వాంతులు వచ్చినట్లు ఉంటాయి. కండరాల నొప్పులు ఉంటాయి. రక్తపోటు తగ్గుతుంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది .శ్వాస వేగం పెరుగుతుంది. చివరికి నీరసం, నిస్సత్తువకులోనై స్పృహ కోల్పోవడం జరుగుతుంది .

**వడ దెబ్బ తగిలితే ఏం చేయాలి ?** వడదెబ్బ కు గురైన వారి బట్టలు టైట్ గా ఉంటే వదులు చేయాలి. దేహానికి గాలి తగలనివ్వాలి. అవకాశాన్ని బట్టి చల్లని ఫ్యాన్ గాలి లేదా ఏసీ కిందకు చేర్చి సేద తీరనివ్వాలి. పరిశుభ్రమైన నీటిలో ఉప్పు, పంచదార కలిపి త్రాగించాలి. నోటి ద్వారా తీసుకోలేకపోతుంటే వైద్యుని సంప్రదించి సెలైన్ పెట్టించాలి. శరీరంపై చల్లని నీటితో తడిపిన గుడ్డతో అద్దుతూ ఉండాలి .శరీర ఉష్ణోగ్రత అత్యధిక స్థాయికి చేరితే ఐస్ ప్యాక్లను శరీరంపై ఉంచాలి. చెమట ద్వారా శరీరం కోల్పోయిన ద్రవాన్ని భర్తీ చేయాలి లేకపోతే రక్త పోటు పడిపోతుంది .ఫలితంగా కిడ్నీల పనితీరులో మార్పులు వస్తాయి .ఆ తర్వాత ఆ ప్రభావం అన్ని అవయవాల మీద పడుతుంది. నిమిషాలలో మనిషిని అత్యంత ప్రమాదకర స్థితికి తీసుకు వెళ్లగల శక్తి వడదెబ్బకు ఉంది. కనక అశ్రద్ధ ఏమాత్రం మంచిది కాదు.వడదెబ్బ నుండి పూర్తిగా కోల్పోవడానికి రెండు మూడు రోజుల సమయం పడుతుంది .

**వడదెబ్బ ఎక్కువగా ఎవరికి తగులుతుంది ?** వడదెబ్బ ఏ వయసు వారికైనా తగల వచ్చును. సాధారణంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతారు. సన్నగా ఉన్న వారి కంటే స్థూలకాయలు ఎక్కువగా వడదెబ్బకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయి .సరైన నిద్రలేని వారు ,ఉపవాసం ఉన్నవారు, మద్యపానం అలవాటు ఉన్నవారు, మూత్రపిండాలు, జీర్ణాశయ వ్యాధులతో బాధపడేవారు, జ్వర బాధితులు, సోరియాసిస్, ఎగ్జిమా వంటి చర్మవ్యాధులు గలవారు, శ్వేదగ్రంధులు సరిగా పనిచేయని వారు ,ఎండలో ఎక్కువగా తిరిగేవారు, ఎక్కువగా వడదెబ్బకు గురవుతుంటారు. బయట ఎండలో తిరిగే వారికే కాక ఇరుగు గదుల్లోనూ ,అధిక జన సాంద్రత గల చోట్ల నివసించే వారు కూడా వడదెబ్బకు గురవుతారు. వడదెబ్బకు గురికావడానికి ఎండలోనే తిరగాల్సిన అవసరం లేదు.

**వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు**
1)ఎండాకాలంలో బయట ఎక్కువగా తిరగకుండా ఉండాలి. తప్పనిసరి పరిస్థితులలో తిరగాల్సి వచ్చినప్పుడు టోపీ గాని, గొడుగు గాని ఉపయోగించాలి. 2)వాతావరణం లోని వేడికి చెమట ఎక్కువగా పట్టడం వల్ల దేహం నీరు ,లవణాలను కోల్పోతుంది కాబట్టి రోజుకి 6 నుంచి 8 లీటర్లు పరిశుభ్రమైన చల్లని నీరు తీసుకోవడం మంచిది. ఆరోగ్యవంతులుఆహారంతో పాటు 20 గ్రాములకు తగ్గకుండా ఉప్పు తీసుకోవాలి .3)తేలికగా ఉండి చెమట పీల్చేదుస్తులను ధరించాలి. నల్లని దుస్తులను ధరించకుండా ఉండటం మంచిది .4)ఎండాకాలంలో ఎక్కువసేపు ఎండలో పనిచేయకూడదు. అధిక వ్యాయామం కూడా మంచిది కాదు .4)కాఫీ ,టీలు తగ్గించాలి. మద్యపానం చేయకూడదు ఆహార పదార్థాలలో నూనె తగ్గించాలి .నెయ్యి వాడే అలవాటు ఉంటే బాగా తగ్గించాలి .ఆవకాయ పచ్చడి, కారం ,మసాలాలు, మాంసాహారం తగ్గించి ,ఆకు కూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. రెండు పూటలా స్నానం చేయాలి. శరీరశుభ్రతను పాటించాలి .వేసవికాలంలో కొబ్బరినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, గంజి, బార్లీ, రాగిజావ వంటి ద్ర వపదార్థంలుఎక్కువగా తీసుకోవడం మంచిది. కూల్ డ్రింక్స్ తో పోలిస్తే ఇవి ఆర్థిక పరంగా ,ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తాయి. మామిడి ,పుచ్చ ,సపోటా, కమలా ,ద్రాక్ష, అరటివంటి ఫలాలు తీసుకోవచ్చును.అధిక వేడి నుండి నేత్రాలను రక్షించేందుకు చలవ అద్దాలను (సన్ కూల్ గ్లా సెస్) ధరించడం మంచిది .ఆసుపత్రిలో అడుగుపెడితే వైద్యం ఖర్చులు తడిసి మోపెడవుతున్న ఈరోజులలో పైన పేర్కొన్న ముందు జాగ్రత్తల విషయంలో కాస్త శ్రద్ధ వహిస్తే .... అత్యంత వాతావరణ ఉష్ణోగ్రత గల వేసవి కాలంలో కూడా వడదెబ్బకు గురికాకుండా పూర్తిగా రక్షించుకోవచ్చును.

## మలేరియా రహిత సమాజాన్ని సమిష్టిగా సాధిద్దాం

**- మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు**



**విస్సన్నపేట ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు సారధ్యంలో జరిగిన సమావేశంలో మలేరియా నిర్మూలన లక్ష్యాలను సమిష్టిగా సాధిద్దాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశ్వినీ దత్, డాక్టర్ నాగేశ్వరరావు హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు.

## మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

**వైద్యాధికారి డాక్టర్ వినయ్**



**పిఠాపురం, ఏప్రిల్ 25, ( వార్తా ప్రభ ) :**మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. వై. వినయ్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగయ్యమ్మరావుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు, డీఎంఓ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీకి సుమారు 100 మంది హాజరయ్యారు.యూపీహెచ్‌సీ నుండి ప్రారంభమైన ర్యాలీ పిఠాపురం మున్సిపల్ కార్యాలయం మీదుగా ప్రధాన రహదారిలో కొనసాగింది.మలేరియా నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ పలు నినాదాలు చేశారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల పెరుగుదలను నివారించవచ్చని డా. వినయ్ తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియా వంటి వ్యాధులను దూరం పెట్టవచ్చన్నారు. చిన్న దోమ కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ వై. రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ అనూష, ఓఎస్ రాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిఎంసి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సుంకర భవానికి గౌరవ డాక్టరేట్



**పెడన,ఏప్రియల్25: వార్తా ప్రభ )** ప్రముఖ యోగ శిక్షకురాలు సామాజిక సేవకురాలు సుంకర దుర్గా భవానీకి గౌరవ డాక్టరేట్ లభించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ వారు ఈ గౌరవాన్ని ప్రధానం చేశారు. తమిళనాడు రాష్ట్రం హోసూరు టీ జి ఐ గ్రాండ్ ఫార్చున లో శనివారం నాడు భవానీని ఘనంగా సత్కరించి అవార్డు అందజేశారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ అమెరికన్ విసడమ్ పీస్ అకాడమీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కృష్ణమూర్తి మహాస్వామి గల్లు చేతుల మీదుగా భవాని ఈ గౌరవాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా జరిగిన సభలో తనకు ఈ గౌరవాన్ని అందించిన నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింత శ్రమిస్తానని భవాని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ శ్రీధర్ డాక్టర్ సుబ్రమణ్యం డాక్టర్ బీఎం బళ్లారి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాజిల్లా గ్రంధాలయం ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ ఓరియంటేషన్ క్లాసులు...

**జిల్లా కార్యదర్శి వి. రవికుమార్**



**మచిలీపట్నం, ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వేసవి సెలవులు పురస్కరించుకుని కృష్ణాజిల్లా గ్రంథాలయం ప్రాంగణంలో ఎల్. కే. జి.నుండి డిగ్రీ వరకు విద్యార్థి విద్యార్థులకు ఉచితంగా వివిధ రకాల శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు కృష్ణా జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి వి. రవికుమార్ తెలియజేశారు. శనివారం మచిలీపట్నంలోని వివిధ సంస్థల ప్రతినిధులు పుర ప్రముఖులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో నిష్ణాతులైన మేధావులతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలుగు తీసేందుకు ఈ ఉచిత శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. హిందూ కాలేజీ పూర్వ కెమిస్ట్రీ హెడ్ అఫ్ డిపార్ట్మెంట్ దిట్టకవి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి సెలవులలో పిల్లలు మొబైల్ ఫోన్ తో ఇతర ఆటకాయ పనులతో సమయం వృధా చేయకుండా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు పోర్ట్ రోడ్ లోని జిల్లా గ్రంథాలయంలో ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. సాహితీ సంస్థల అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ పిల్లలకు చదివే ముఖ్యం కాదని ఇతర రంగాల్లో వారికి గల టాలెంటును బయటికి తీయడానికి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. జిల్లా గ్రంథాలయంలో దాగి ఉన్న విజ్ఞానాన్ని పిల్లలకి అందించవలసిన అవసరం ఎంతగానో ఉందన్నారు. విశ్రాంత మండల దెవలప్మెంట్ అధికారి కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వేసవి లో పిల్లలు సద్వినియోపరిచే విధంగా తల్లిదండ్రులు చూడాలని పిల్లల అభివృద్ధి కోసం శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రరీ బీరం వెంకటరమణ మాట్లాడుతూ ఇప్పటికే అన్ని కళాశాలలకు ముందస్తుగా సమాచారం ఇచ్చామని నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏప్రిల్ 28వ తారీకు నుండి తరగతులు ప్రారంభమవుతాయని జూన్ 6 తేదీ వరకు జరుగుతాయని తెలియజేశారు. ముగింపు సభలో పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి మేడిశెట్టి యోగేశ్వరరావు ఎం. వి.వి. రామాంజనేయులు బాబు, ప్రముఖ కవయిత్రి రాధిక రాణి గుడిపూడి, ఇంటి రామారావు జిల్లా లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు

# మచిలీపట్నంలో డీజిల్ కొరత

**- ఆటో డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందులు.**



**మచిలీపట్నం ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నంలో గత రెండు రోజులుగా డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో డీజిల్ అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు బంకుల వద్ద గంటల తరబడి బారులు తీరుతూ డీజిల్ కోసం ఎదురుచూస్తున్నారు. డీజిల్ సరఫరా నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. రోజువారీగా ఆటోలపై ఆధారపడే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మరోవైపు, ఆటో డ్రైవర్లు ఆదాయం కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. కుటుంబాలను పోషించడమే కష్టంగా మారిందని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొరతకు కారణాలపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడం ప్రజల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది. సరఫరా లోపం తాత్కాలికమా, లేక మరింత కాలం కొనసాగుతుందా అన్నది తెలియక ఇంధన వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డీజిల్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు, ఆటో యూనియన్లు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

## ప్రపంచ పశువైద్య దినోత్సవం వేడుకలు



**హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 25(వార్తాప్రభ)**ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా, కాకులపాడు గ్రామంలో పశువైద్య రంగంలో సేవలందిస్తున్న వెటర్నరీ వైద్యులు మరియు సిబ్బందిని ఘనంగా సత్కరించిన కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు.ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మూగ జీవాల ఆరోగ్యం, సంరక్షణ కోసం నిరంతరం అంకితభావంతో శ్రమిస్తూ, 24/7 అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న వారి కృషి సమాజానికి అమూల్యమైనది అని కొనియాడారు.పశుసంపద అభివృద్ధి రైతుల ఆర్థిక స్థిరత్వానికి ప్రధాన ఆధారం కాగా, ఆ అభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్న వెటర్నరీ సిబ్బంది సేవలు అత్యంత కీలకమైనవని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కష్టసుఖాలను లెక్కచేయకుండా, ప్రతి పశువు ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్న వారి సేవాస్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ హరి బాబు, పాడి రైతులు మరియు సమితి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## జనగణన-2027 అవగాహన 5కే రన్.



**మచిలీపట్నం ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** భారతదేశ జనగణన--2027 నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెం పొ ందించేందుకు మచిలీ పట్నంలో శనివారం ప్రత్యేక 5కే రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా ఇంచార్జి కలెక్టర్ నవీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.లక్ష్మీ టాకీస్ సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ఈ రన్‌లో పాల్గొన్న అధికారులు “జనగణన--దేశాభివృద్ధికి ఆధారం”, “ప్రతి వ్యక్తి నమోదు -- దేశ ప్రగతికి దోహదం” వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సరిగ్గా సమాచారం ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించేందుకు సహకారం అందుతుందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో జనగణనపై స్పష్టత పెరగడంతో పాటు, సామాజిక బాధ్యతపై అవగాహన మరింత బలపడింది.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖర రావు, ఆర్డీవో సాంబశివరావు, కలెక్టరేట్ ఏవో రాధిక, పిడిసి కలెక్టర్ నిఖిల సింగ్, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు ఎమ్మార్వోలు ఇతర ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలు మరియు నేరాలపై అవగాహన



**గుడివాడ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. డీఎస్పీ పాలా శ్రీనివాస్ పర్యవేక్షణలో, సీఐ శ్రీ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై పుల్లా కుమార్ రాజా, శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం, బాల్య వివాహ నిరోధక చట్టం, మహిళల భద్రతా చట్టాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఆర్ లో అంతర్జాతీయ అంగ్ల భాషా దినోత్సవం




**గుడివాడ ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో “అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవంను” ఘనంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్ల భాషకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేయడం, అలాగే విద్య, ఉపాధి, సమాచార మార్పిడి రంగాల్లో దాని కీలక పాత్రను వివరిస్తూ, ఆంగ్ల భాష ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కలిపే సాధనంగా నిలుస్తోందని, ఉన్నత విద్యా అవకాశాలు మరియు ఉద్యోగావకాశాలకు ఇది మార్గం సుగమం చేస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆంగ్ల విభాగాన్ని అభినందిస్తూ, విద్యార్థులు సమర్థమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బిఎస్ఎస్ పద్మజ, ఆంగ్ల అధ్యాపకులు శ్రీ సి.హెచ్. ప్రకాష్, శ్రీమతి ఎ.సుకీల విద్యార్థిని, విద్యార్దులు పాల్గొన్నారు.

## పెడన పి హెచ్ సి ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం




**పెడన ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పరిసరాల శుభ్రత పాటించి అంటురోగాలు ప్రబలకుండా చూడాలని పెడన పిహెచ్సి వైద్యాధికారి ప్రజలను కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పిహెచ్సి వద్ద శనివారం సిబ్బంది రోగులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని మెడికల్ సిబ్బందికి సూచించారు. మెడికల్ ఆఫీసర్ పర్వీన్ హైదర్ తో పాటు మీనా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాంచాహనిక దీక్షతో ప్రారంభమై నసుందరేశ్వర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

**ఆధ్యాత్మిక శోభ తో నిండిపోయిన పరిసర గ్రామాలు**
**తరలివస్తున్న వేలాది మంది భక్తులు**



పెడన ఏప్రిల్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)శ్రీ శబరి ధర్మశాస్తా సేవా సమితి ఆధ్వర్యంలోకృష్ణా జిల్లా పెడన మండలం నేలకొండపల్లి గ్రామంలో సుందరేశ్వర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం“పాంచాహ్నిక దీక్ష”తో వైభవంగా ప్రారంభమయ్యాయి.శైవాగమ కోవిదులు శతాధిక ప్రతిష్ఠాచార్య బ్రహ్మశ్రీ గూడూరు రామకృష్ణ శర్మ శైవాగమ పండితుల ఆధ్వర్యంలో 35 మంది పుణ్య దంపతులతో నిర్వహించారు.గోపూజ విఘ్నేశ్వర పూజపుణ్యాహవాచనంపంచగవ్య మేళనం ప్రాశనందీక్షాధారణయాగశాల బలిహరణ ప్రవేశంఅఖండ దీపారాధన స్థాపనత్రిశూల మండపారాధన జరిగింది. సాయంత్రం అంకురారోపణ అగ్ని ప్రతిష్టాపన ధ్వజారోహణమూలమంత్ర హోమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు.ఈ ఐదు రోజుల పాటు జరుగుచున్న ఈ పుణ్య ఆధ్యాత్మిక మహోత్సవాలలో భక్తులందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. ఈ మహోత్సవాలతో పరిసర గ్రామాలన్నీ కూడా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

PrinterPublisherand owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. EditorV. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188